


APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక




విశాఖపట్నం : మంగళవారం 25 ఆగస్ట్ 2020 ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం VAARTAVALI TELUGU DAILY పేజీలు : 8 రూ. 1.00 సంపుటి 5 సంచిక 189

## అవినీతిని కూకటివేళ్లతో పెకలించాల్సిందే: సీఎం జగన్

**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 24 :** రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి ఉండకూడదని, అవినీతిని కూకటివేళ్లతో పెకలించాల్సిందేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అవినీతి చేయాలంటే భయపడే స్థాయికి రావాలన్నారు. అవినీతికి ఆస్కారం లేని విధానాలతో ముందుకు వెళ్లాలని చెప్పారు. అవినీతి నిర్మూలనపై ముఖ్యమంత్రి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. 14400 కాల్ సెంటర్, కేబినెట్ సబ్ కమిటీ నివేదిక, ఐఐఎం అహ్మదాబాద్ నివేదిక, రివర్స్ టెండరింగ్, జ్యుడిషియల్ ప్రివ్యూ తదితర అంశాలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1902 నెంబర్‌ను కూడా ఏసీబీతో అనుసంధానం చేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయి నుంచి అవినీతిపై వచ్చే ఫిర్యాదులను కూడా స్వీకరించాలి. వచ్చిన ఫిర్యాదులను మానిటరింగ్ చేసే వ్యవస్థ బలంగా ఉండాలి. 1902కు వచ్చే కాల్స్‌పై బలోపేతమైన అమలు విభాగం ఉండాలి. దీనికి కలెక్టర్ కార్యాలయాలను కూడా అనుసంధానం చేయాలి. టౌన్ ప్లానింగ్, సబ్ రిజిస్ట్రార్, ఎమ్మార్వో, ఎండీఓ కార్యాలయాల్లో అవినీతి ఆనవాళ్లు ఉండకూడదు. దీనిపై ఫోకస్‌గా ముందుకు వెళ్లండి. 14400 నెంబర్‌పై మరింత ప్రచారం నిర్వహించండి, పర్మినెంట్ హోర్డింగ్స్ పెట్టండి. రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన కేసుల్లో చర్యలు తీసుకోవడానికి సంవత్సరాల కాలం పట్టకూడదు. అవినీతికి పాల్పడుతూ, లంచం తీసుకుం టుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ కేసుల్లో కూడా దిశ చట్టం మాదిరిగానే నిర్దిష్ట సమయంలో చర్యలు తీసుకునేలా ఉండాలి. కొన్ని అవినీతి కేసుల విచారణ 25 ఏళ్లుగా సాగుతోంది అంటే.. అవినీతి నిరోధకత విషయంలో సీరియస్‌గా లేమనే సంకేతాలు వెళ్తున్నాయి. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన తర్వాత వెంటనే చర్యలు తీసుకునేలా విధానాలు ఉండాలి. దీనికోసం అసెంబ్లీలో చట్టం తీసుకువచ్చేలా బిల్లును రూపొందించాలి.



**28 ఏళ్ల కాలంలో ప్రభుత్వానికి రూ.322 కోట్లు**

కర్నూలు జిల్లా పిన్నాపురం విద్యుత్ ప్రాజెక్టు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో 2018, జులైలో ఒప్పందం కుదిరింది. 4,766.28 ఎకరాల భూమిని సదరు కంపెనీకి ఇచ్చారు. అప్పటి ప్రభుత్వంలో ఎకరాకు కంపెనీ చెల్లించే మొత్తం రూ.2.5 లక్షలు మాత్రమే. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే కంపెనీతో తిరిగి సంప్రదింపులు జరిపింది. అవే స్పెసిఫికేషన్లతో విద్యుత్ ప్రాజెక్టు ఆ కంపెనీ నిర్మాణానికి ఓకే అంది. ప్రభుత్వానికి ఎకరాకు రూ.2.5 లక్షలకు బదులు రూ.5 లక్షలు ఇవ్వడానికి ఒప్పుకుంది. ఎకరాకు అదనంగా రూ. 2.5 లక్షలు ఈ ప్రభుత్వం తీసుకురాగలిగింది. దీని వల్ల అదనంగా రూ.119 కోట్ల ఆదాయం వస్తోంది. అలాగే సోలార్/విండ్ కింద ఉత్పత్తి చేసే 1550 మెగావాట్ల ఉత్పత్తికి గాను మెగావాట్‌కు రూ.1 లక్ష చెల్లించేందుకు కంపెనీ అంగీకరించింది. దీని వల్ల ఏడాదికి రూ.15.5 కోట్ల చొప్పున 28 ఏళ్ల కాలంలో రూ.322 కోట్లు ప్రభుత్వానికి వస్తాయి.అంతే కాక రివర్స్ పంపింగ్ ద్వారా ఉత్పత్తి చేయనున్న 1680 మెగావాట్ల కరెంటుకు గాను, మెగావాట్‌కు మొదటి పాతికేళ్లలో రూ.1 లక్ష, తద్వారా ఏడాదికి రూ.16.8 కోట్లు, 25 ఏళ్ల తర్వాత రూ.2 లక్షలు చొప్పున ఏడాదికి రూ.33.6 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. దీని వల్ల ప్రభుత్వానికి అదనంగా రూ. 2,940 కోట్లు ఆదాయం వస్తుంది. ఈ ప్రభుత్వం వచ్చాక అదే కంపెనీతో సంప్రదింపులు కారణంగా రూ.3,381 కోట్లు ప్రభుత్వానికి అదాయం వస్తోంది. ఇదే గత ప్రభుత్వంలో కేవలం రూ.119 కోట్లు మాత్రమే ఆదాయాన్ని చూపించారు. ప్రభుత్వానికి ఈ రకమైన మేలు చేయడానికి ప్రయత్నించిన అధికారులను అభినందిస్తున్నా.

**ప్రభుత్వం మారింది.. 500 ఎకరాలు మిగిలింది**

భోగాపురం ప్రాజెక్టు విషయంలో కూడా ఈ ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి తేడా ఏంటో చాలా స్పష్టంగా కనిపించింది. గత ప్రభుత్వం 2703 ఎకరాలను విమానాశ్రయానికి కేటాయిస్తే.. అదే కంపెనీతో ఈ ప్రభుత్వం సంప్రదింపులు జరిపింది. అదే కంపెనీ 2203 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ముందుకు వచ్చింది. గత ప్రభుత్వంతో ఒప్పందం సమయంలో కడతానన్న ప్రతి సదుపాయం కూడా 2203 ఎకరాల్లో ఆ కంపెనీ కట్టేందుకు ముందుకు వచ్చింది. కంపెనీ మారలేదు, ప్రాజెక్టులో ఎలాంటి మార్పులు లేవు, భూమీ మారలేదు. వచ్చిందల్లా ప్రభుత్వంలో మార్పే. పునర్ సంప్రదింపులు కారణంగా 500 ఎకరాల భూమి ప్రభుత్వానికి మిగిలింది. ఎకరాకు రూ. 3 కోట్లు వేసుకున్నా ప్రభుత్వానికి రూ.1500 కోట్లు ఆదాయం మిగిలినట్టే.

**రివర్స్ టెండరింగ్ :**

సుపరిపాలనలో భాగంగా, విప్లవాత్మక మార్పుగా చేపట్టిన రివర్స్ టెండరింగ్ పైనా అధికారులు సీఎంకు వివరాలు అందించారు. మొత్తంగా 788 టెండర్లకు రివర్స్ టెండరింగ్ నిర్వహించామని తెలిపారు. సాధారాణ టెండర్ల ప్రక్రియ ద్వారా 7.7 శాతం మిగులు ఉండగా, రివర్స్ టెండరింగ్ ద్వారా 15.01 శాతం మిగులు ఉంటుందని వెల్లడించారు.

**జ్యుడిషియల్ ప్రివ్యూ:**

రూ.100 కోట్లు దాటిన ఏ ప్రాజెక్టుకైనా జ్యుడిషయల్ ప్రివ్యూకు వెళు న్నామని అధికారులు వివరించారు. 2019 ఆగస్టు నుంచి 2020 ఆగస్టు వరకు 45 ప్రాజెక్టులు ఆ ప్రివ్యూకు వెళ్లాయని చెప్పారు. రూ.14,285 కోట్లు విలువైన పనులు జ్యుడిషయల్ ప్రివ్యూకు వెళ్లాయని ముఖ్యమంత్రికి అధికారులు వెల్లడించారు.



## సీనియర్లు బీజేపీతో కుమ్మకైయ్యారు: రాహుల్..



**ఢిల్లీ:** దేశంలో 135 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఉన్న కాంగ్రెస్ పార్టీలో ఎన్నడూ లేని విదంగా ఇప్పుడు కొన్ని ఘటనలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ వరుసగా ఎన్నికల్లో ఓటమి పాలుకావడంతో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయే విధంగా పరిస్థితి తయారైంది. ఈ సమయంలో అధినేత్రి సోనియా గాంధీకి 23 మంది సీనియర్లు రాసిన లేఖ ప్రకంపనలు సృష్టిస్తోంది. సోనియాకు అత్యంత విధేయులుగా ఉన్న ఆ సీనియర్లు బీజేపీ వలలో చిక్కుకున్నారని కమలనాథుల కుట్రల్లో పావులుగా మారారనే మరో అంశం ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఈ వాదన ను తెరపైకి తీసుకువచ్చింది .. సాక్ష్యాత్తూ రాహుల్ గాంధీనే కావడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి అత్యున్నత నిర్ణయాత్మక మండలి 'సీడబ్ల్యూసీ సోమవారం సమావేశమైంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన భేటీలో అనూహ్య పరిణామాలు సంచలనాలు చోటు చేసుకున్నాయి. పార్టీకి సమర్ధవంతమైన నాయకత్వం ఉండాలని కింది నుంచి పైదాకా ప్రక్షాళన చేయాలంటూ 23 మంది సీనియర్లు రాసిన లేఖపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. లేఖ విడుదలైన టైమింగ్ పైనా ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. రాహుల్ మాటలకి సీనియర్లు కౌంటర్ ఇచ్చారు. ఆరోపణలు నిరూపించకుంటే రాజీనామా చేస్తామని తెగేసి చెప్పారు. తాము బీజేపీతో కుమ్మకయ్యామనడానికి ఆధారాలుంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఏ చిన్న పాయింట్ చూపించినా తక్షణమే రాజీనామా చేస్తామంటూ గులాం నబీ ఆజాద్ కపిల్ సిబల్ సవాలు విసిరారు. తమను రాహుల్ గాంధీ ఎంత దారుణంగా అవమానించాడో సిబల్ స్వయంగా ట్విటర్ ద్వారా అందరికి తెలియజేసారు. గడిచిన 30 ఏళ్లలో బీజేపీకి అనుకూలంగా తాము ఏ విషయంలోనూ వ్యవహరించలేదని గుర్తు చేశారు. రాజస్థాన్ లో ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు కాంగ్రెస్ పక్షాన నిలిచి పోరాటం చేసాం అని మణిపూర్ లో బీజేపీని గద్దె దించేందుకు పార్టీ పక్షాన పోరాడామని పేర్కొన్నారు. అయినప్పటికీ తాము బీజేపీతో కుమ్మక్కయ్యామని రాహుల్ వ్యాఖ్యానించడం పట్ల కపిల్ సిబాల్ అసహనం వ్యక్తం చేశారు. ఆజాద్ కూడా దాదాపు ఇదే రీతిలో రియాక్ట్ అయ్యారు.

## రమేష్‌ను చంద్రబాబు ఎందుకు వెనకేసుకొస్తున్నారు?



**తాడేపల్లి, వార్తావళి, ఆగస్ట్ 24 :** అమరావతిలో ప్రజా ఉద్యమమే లేదు. అక్కడ జరిగేది భూస్వామ్య, పెట్టుబడిదారి, ధనవంతుల ఉద్యమం అన్నారు వైస్సార్సీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. 'చంద్రబాబు రాజధాని కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నట్టు భ్రమ కల్పిస్తున్నారు. అమరావతి అనేది పెద్ద స్కాం. చంద్రబాబు తన తాబేదార్లు కోసం పెట్టిందే అమరావతి. రాజధాని కోసం 85 మంది చనిపోయిన దాఖలాలు లేవు. అదంతా ఓ కట్టుకథ. రాజధాని కోసం త్యాగాలు లేవు. సాధారణంగా చనిపోయిన వారిని అమరావతి కోసం చనిపోయారని ప్రచారం చేస్తున్నారు. 85 మంది అమరావతి కోసం చనిపోతే ఉద్యమమం ఇలా ఉంటుందా. దళితులకు ఇచ్చిన భూములను టీడీపీ నేతలు బలవంతంగా లాక్కున్నారు. అమరావతిలో జరిగిన అక్రమాలపై విచారణ జరుగుతుంది. ఇప్పటికే కొంతమందిని అరెస్ట్ చేశారు. త్వరలో మరికొంత మందిని అరెస్ట్ చేస్తారు. అభివృద్ధి అంతా హైదరాబాద్‌లో కేంద్రీకృతం కావడం వలన మనం నష్ట పోయాం. ఏ ప్రాంతానికి అన్యాయం జరగకూడదనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన వికేంద్రీకరణ చేశారు' అని స్పష్టం చేశారు అంబటి. అంతేకాక 'జూమ్‌లో చంద్రబాబు ప్రజలను రెచ్చగొడుతున్నారు. ఎవరిని సంప్రదించకుండా మూడు రాజధానులపై నిర్ణయం తీసుకున్నారని మాట్లాడటానికి చంద్రబాబుకు సిగ్గుండాలి. పరిపాలన వికేంద్రీకరణపై శాసనసభలో చర్చ జరిగింది. ఆ రోజు చంద్రబాబు అసెంబ్లీ నుంచి పారిపోయారు. పీడిత ప్రజలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబుకు సీపీఐ రామకృష్ణ మద్దతు తెలుపుతున్నారు. తమది కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియానా.. లేక క్యాప్టలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియానా అనే దానికి రామకృష్ణ సమాధానం చెప్పాలి. నేరం జరిగినప్పుడు దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. రమేష్ హాస్పిటల్స్ నిర్లక్ష్యం కారణంగా పది మంది చనిపోయారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదా. అప్పుడు నిమ్మగడ్డ రమేష్, ఇప్పుడు డాక్టర్ రమేష్‌ను చంద్రబాబు ఎందుకు వెనకేసుకొస్తున్నారు. ఎందుకు దాస్తున్నారు.. తనని పోలీసులకు అప్పగించాలి. విచారణకు రమేష్ సహకరించాలి. తనని ఎక్కడ దాచారో చంద్రబాబు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు అంబటి.

## ఏపీ విద్యాశాఖ మంత్రికి కరోనా



**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 24 :** కరోనా ఏపీలో కోరలు చాస్తోంది. అందరికీ సోకుతోంది. రోజుకు 10వేల చొప్పున కేసులు నమోదవుతూ తీవ్రత మాత్రం తగ్గడం లేదు. దీంతో సామాన్యులు అధికారులు ఎమ్మెల్యేలు మంత్రులు.. ఇలా ఎవ్వరినీ వదిలిపెట్టడం లేదు. తాజాగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు స్వల్ప లక్షణాలు కనిపించడంతో ఆయన ఎర్రగొండెపాలెం పీహెచ్.సీలో కరోనా పరీక్షలు చేయించు కున్నారు. తాజాగా వెలువడ్డ ఆ పరీక్షల్లో మంత్రికి పాజిటివ్ గా నిర్ధారణ అయ్యిందని వైద్య అధికారులు తెలిపారు. దీంతో తనను కలిసిన వారందరూ పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సురేష్ కోరారు. ఇప్పటికే ప్రకాశం జిల్లాలో చాలా మంది ప్రజాప్రతినిధులు కరోనా బారినపడ్డారు. ఇప్పుడు విద్యాశాఖ మంత్రి సురేష్ కూడా ఆ మహమ్మారి బారిన పడడం గమనార్హం.

## ప్రఖ్యాత బిజినెస్ స్కూల్లో సీటు సాధించిన జగన్ కుమార్తె



**అమరావతి, వార్తావళి, ఆగస్ట్ 24 :** ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుటుంబం మరింత సంతోషానికి గురయ్యే పరిణామం ఒకటి చోటు చేసుకుంది. జగన్ పెద్ద కుమార్తె హర్ష రెడ్డి ప్రపంచ ప్రఖ్యాత బిజినెస్ స్కూల్లో అడ్మిషన్ సాధించింది. పారిస్ లోని క్యాంపస్ లో ఆమె తన మాస్టర్స్ డిగ్రీని చేయనున్నారు. రాజకీయంగా సుపరిచితమైన జగన్.. ఆయన వ్యక్తిగత విషయాలు.. కుటుంబ సభ్యుల వివరాలు పెద్దగా బయటకు రావు. ఇప్పటికే విదేశాల్లో చదివిన జగన్మోహన్ రెడ్డి పెద్ద కుమార్తె.. తాజాగా ప్రఖ్యాత బిజినెస్ స్కూల్ ఇన్సీడ్‌లో సీటును సాధించింది. ఈ నేపథ్యంలో మంగళ వారం ఆమె పారిస్ కు వెళ్లనున్నారు. హర్ష రెడ్డికి సెండాఫ్ ఇచ్చేందుకు జగన్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా బెంగళూరుకు వెళ్లి.. ఆమెకు వీడ్కోలు పలకనున్నారు. ఇప్పటికే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన హర్ష రెడ్డి స్వదేశానికి వచ్చారు. హర్షకు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో సీటు వచ్చిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమెకు అభినందనలు తెలిపారు. ఏమైనా.. తెలుగు గడ్డ మీద రాజకీయ ప్రముఖుల ఇళ్లల్లో ప్రఖ్యాత కళాశాలలో మాస్టర్స్ చేసిన అతి కొద్దిమందిలో హర్ష రెడ్డి ఒకరుగా చెప్పక తప్పదు.

## కరోనా దెబ్బకి 66 శాతం మానేశారా !

**ఢిల్లీ:** కరోనా వైరస్...ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అతి పెద్ద సమస్య. ఈ మహమ్మారి వెలుగులోకి వచ్చి నెలలు గడుస్తున్నా కూడా దీనికి ఇంతవరకు సరైన వ్యాక్సిన్ లేదు. అయితే చాలా దేశాల వైద్య నిపుణులు కరోనా వ్యాక్సిన్ ను కనిపెట్టే పనిలో నిమగ్నమైయ్యారు. రష్యా ఇప్పటికే ఓ వ్యాక్సిన్ ను వెలుగులోకి తీసుకువచ్చింది. కానీ రష్యా వ్యాక్సిన్ పై చాలా దేశాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఇకపోతే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 2 కోట్ల 30 లక్షల మంది కరోనా భారిన పడ్డారు. ఇక మనదేశంలో ఇప్పటికే పాజిటివ్ కేసుల సంఖ్య 30 లక్షలు దాటిపోయింది. ఇకపోతే కరోనా మహమ్మారి దెబ్బకి .. ప్రపంచంలోని చాలా దేశాలు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. రోజురోజుకి కరోనా లక్షణాలు వెలుగులోకి వస్తున్నాయి.

## పేదలకు ఇళ్ల పంపిణీ



**ఏలూరు, వార్తావళి, ఆగస్ట్ 24 :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహనరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణిలో భాగంగా స్థలం చదును చేయడానికి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మట్టిని తరలించడం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపి డిప్యూటీ సిఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని ఆదేశించారు. పోలవరం రైట్ మెయిన్ కెనాల్ సర్కిల్ పరిధిలో ఉన్న మట్టిని క్యూబిక్ మీటర్ 86రూపాయలు చొప్పున మట్టిని తరలించడం కోసం ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని మంత్రి ఆళ్ల నాని విజ్ఞప్తి చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాల యంలో సోమవారం పోలవరం రైట్ మెయిన్ కెనాల్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా సత్తనెపల్లిలో బాధ్యతలు నిర్వహిస్తున్న బి శ్యామ్ ప్రసాద్‌ను ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా పోలవరం రైట్ మెయిన్ కెనాల్ సర్కిల్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. శ్రీ శ్యామ్ ప్రసాద్ మర్యాద పూర్వకంగా ఏపి డిప్యూటీ సిఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నానిని కలిసి పుష్పగుచ్ఛము అందచేసారు. అనంతరం జరిగిన సమీక్షలో మంత్రి ఆళ్ల నాని మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న ఇళ్ల స్థలాలు చదును చేయడానికి జిల్లా యంత్రాంగం క్యూబిక్ మీటర్ మట్టిని 86రూపా యలకు కేటాయించాలని ఇచ్చిన ఆదేశాలు పాటించక పోవడం పై మంత్రి ఆళ్ల నాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని టాక్స్‌లతో కలిపి 135రూపాయలు వసూలు చేయడం ఎంత వరకు కరెక్ట్ అని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ప్రశ్నించారు.. వెంటనే మంత్రి ఆళ్ల నాని ఏపి ఇరిగేషన్ సెక్రటరీ ఆదిత్యనాథ్‌తో ఫోన్లో మాట్లాడి క్యూబిక్ మీటర్ 86రూపాయలకే కాకుండా మట్టి సరఫరా కు చర్యలు తీసుకోవా లని మంత్రి ఆళ్ల నాని కోరారు. పేదలకు ఇచ్చే స్థలాల్లో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యం లేకుండా త్వరగా మట్టిని తరలించడం కోసం చర్యలు తీసుకోవాలని, కొత్తగా ఇస్తున్న స్థలాల్లో కనీస వసతులు కల్పించవలసిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి ఆళ్ల నాని చెప్పారు. ఈ సమావేశంలో ఇంచార్జి బి శ్యామ్ ప్రసాద్, గురు ప్రసాద్, డిప్యూటీ సూపరింటెం డెంటింగ్ ఇంజినీర్ రాజు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మామిళ్ల పల్లి జయప్రకాశ్, ఏపి మెడికల్ కౌన్సిల్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ దిరి శాల వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## నెమళ్లతో ప్రధాని నరేంద్ర మోడీ సందడి



**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోడీ.. జాతీయ పక్షులు నెమళ్లకు ఆహార పదార్థాలను తినిపిస్తున్న వీడియో ఒకటి ఇప్పుడు వైరల్‌గా మారింది. ఢిల్లీలోని తన నివాసంలో నెమళ్లతో కలిసి సందడి చేశారు మోడీ. సాధారణంగా నెమళ్లను మచ్చిక చేసుకోవడం అంత ఈజీ ఏమీ కాదు. కానీ, ఈ నెమళ్లు ఎంతో స్వేచ్ఛగా నరేంద్ర మోడీ నివాసంలో కలిగియ తిరుగుతుండటం విశేషం. పురివిప్పి నాట్యమా డాయి. వాటికి ఆయన తన చేతులతో స్వయంగా ఆహారాన్ని అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో కూడిన ఓ పోస్టును నరేంద్ర మోడీ తన ట్విట్టర్ ఖాతాలో పంచుకున్నారు. కాగా, ప్రకృతి ప్రేమికులైన ప్రధాని నరేంద్ర మోడీ నివాసం పూల మొక్కలు, చెట్లతో సుందరంగా ఉంది. ప్రధాని నరేంద్ర మోడీ తన ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్తున్న సమయంలోనూ.. అలాగే వాకింగ్ చేస్తున్న సమయంలోనూ నెమళ్లు స్వేచ్ఛగా ఆయన సమీపంలోనే తిరుగుతున్నాయి.

# ప్రణబ్ ఆరోగ్యంలో ఎలాంటి మార్పులేదు..!



**దిల్లీ:** భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ప్రస్తుతం ఆయన కోమాలో ఉన్నారని దిల్లీ కంటోన్మెంట్‌లోని సైనిక ఆసుపత్రి వెల్లడించింది. వెంటిలేటర్ సహాయంతోనే చికిత్స అందిస్తున్నామని తెలిపింది. అయితే.. ఆయన ఆరోగ్య సూచీలు మాత్రం నిలకడగానే ఉన్నాయని తాజా హెల్త్ బులెటిన్‌లో పేర్కొంది. మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆగస్టు 10న ప్రణబ్ ముఖర్జీ దిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో ఆయనకు కరోనా వైరస్ సోకినట్లు తేలింది. అనంతరం ఊపిరితిత్తులకు ఇన్ఫెక్షన్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం ప్రత్యేక వైద్యబృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది.

## కొవిడ్‌తో ఊపిరితిత్తుల్లో నష్టం ఇలా.. !

**కళ్లకు కట్టిన వినూత్న చిత్రీకరణ విధానం**



**బెర్లిన్:** తీవ్రస్థాయి కొవిడ్-19 వల్ల ఊపిరితిత్తుల్లో జరిగే నష్టాన్ని జర్మనీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. దెబ్బతిన్న ఊపిరితిత్తుల కణజాలాన్ని చిత్రీకరించడానికి వీరు హై రిజల్యూషన్ ఇమేజింగ్‌తో కూడిన వినూత్న విధానాన్ని ఉపయోగించారు. ఈ మహమ్మారికి చికిత్స చేయడానికి కొత్త మార్గాలను కనుగొనడానికి ఈ పరిశోధన ఉపయోగపడుతుందని వారు చెప్పారు. గాటింగెన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. వీరు ఒక వినూత్న ఎక్స్‌రే విధానాన్ని కనుగొన్నారు. ఇది కరోనా వైరస్‌తో ఇన్‌ఫెక్షన్‌కు గురైన ఊపిరితిత్తుల కణజాలాన్ని త్రీడీలో, అత్యధిక రిజల్యూషన్‌తో చిత్రీకరించడానికి వీలు కల్పించింది. "అంతర్గతంగా ఏం జరుగుతోందన్నది మనం స్పష్టంగా చూడటం వల్ల రోగి ఉపశమనానికి ఎలాంటి విధానాలు, ఔషధాలు ఉపయోగించాలన్న దానిపై స్పష్టత వస్తుంది" అని పరిశోధనలో పాలుపంచుకున్న డేనీ జోనిగ్ చెప్పారు.

## మిమ్మల్ని చాలా మిస్ అవుతున్నాను: మోదీ



**దిల్లీ:** దివంగత భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తొలి వర్ధంతి రోజున ప్రధాని మోదీ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జైట్లీని చాలా మిస్సవుతున్నానని అన్నారు. ట్విటర్‌లో నాటి వీడియోను ఒకదాన్ని జత చేసి, నివాళులు అర్పించారు. 'గతేడాది ఈ రోజున అరుణ్ జైట్లీజీ మనకు దూరమయ్యారు. నా స్నేహితుడిని నేను ఎంతగానో మిస్సవుతున్నాను. ఆయన ఎంతో శ్రద్ధగా దేశానికి సేవ చేశారు. చాతుర్యం, తెలివి, చట్టపరమైన విజ్ఞానం, వ్యక్తిత్వంలో ఆయన మేటి' అంటూ ఆయనపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర భాజపా నేతలు ఆయన సేవలను కొనియాడారు. దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గతేడాది ఆగస్టు 24న జైట్లీ కన్నుమూశారు. ఆ సమయంలో మోదీ యూఏఈ పర్యటనలో ఉన్నారు.

## వ్యాక్సిన్‌పై వార్తలు ఖండించిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్

**పుణే:** దేశీయంగా మరో 73 రోజుల్లో కొవిషీల్డ్ వ్యాక్సిన్ అందుబాటులోకి వస్తుందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఇండియా (ఎస్‌ఐఐ) తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. "సీరమ్ సంస్థకు చెందిన కొవిషీల్డ్ వ్యాక్సిన్ మరో 73 రోజుల్లో మార్కెట్లోకి అందుబాటులోకి వస్తుందన్న వార్తలు అసత్యం, ఊహాజనితం. ప్రస్తుతం వ్యాక్సిన్ తయారుచేసి, భవిష్యత్తు అవసరాల కోసం దానిని నిల్వ చేయడానికి మాత్రమే ప్రభుత్వం మాకు అనుమతించింది. పరీక్షలు విజయవంతమై, అవసరమైన అనుమతులు లభించిన తర్వాత మాత్రమే కొవిషీల్డ్ వాణిజ్య పరంగా అందుబాటులోకి వస్తుంది. ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా వ్యాక్సిన్ మూడో దశ పరీక్షలు జరుగుతున్నాయి, ఈ వ్యాక్సిన్ సమర్థంగా పనిచేస్తోందని నిరూపణ అయిన తర్వాతే దాని లభ్యతపై సీరమ్ సంస్థ అధికారికంగా ప్రకటన చేస్తుంది" అని ఎస్‌ఐఐ వివరణ ఇచ్చింది.

# ఇంకా ఎక్కువ మందినే కాల్చాలనుకున్నా..

**మూడేళ్ల చిన్నారిపై కూడా కనికరం చూపని క్రైస్ట్‌చర్చ్ హంతకుడు**



**క్రైస్ట్‌చర్చ్:** గత ఏడాది న్యూజిలాండ్‌లోని ప్రార్థనా స్థలాలపై దాడిచేసిన ఘటనకు సంబంధించిన విచారణ ఈ రోజు ప్రారంభమైంది. ఈ ఘటనలో 51 మందిని పొట్టన పెట్టుకున్న నిందితుడు ఏ మాత్రం పశ్చాత్తాపానికి గురికాకుండా "ఇంతకంటే ఎక్కువ మందిని కాల్చాలని అనుకున్నా" అని చెప్పడం గమనార్హం. ఆస్ట్రేలియాకు చెందిన ఈ వ్యక్తి గత సంవత్సరం న్యూజిలాండ్‌లోని రెండు ప్రార్థనా మందిరాల్లో విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. 2017లో ఆస్ట్రేలియా నుంచి న్యూజిలాండ్‌కు వచ్చిన 29 ఏళ్ల బ్రెటన్ టారాంట్.. క్రైస్ట్‌చర్చ్‌కు 360 కి.మీ దూరంలోని డ్యునెడన్‌లో నివాసం ఏర్పర్చుకున్నాడు. ఓ పథకం ప్రకారమే భారీగా ఆయుధాలను సమకూర్చుకున్నాడు. దాడికి రెండునెలల ముందు డ్రోన్‌తో రెక్కీ నిర్వహించినట్టు తెలిసింది. అంతేకాకుండా ప్రార్థనా స్థలాలను దహనం చేసేందుకు పెట్రోల్ టిన్నులు కూడా సిద్ధం చేసుకున్నాడు. మార్చి 15, 2019లో సుమారు గంట సేపు బ్రెటన్ టారాంట్ విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు. ఆ ఘటనను సామాజిక మాధ్యమాల్లో లైవ్‌స్ట్రీమ్ చేశాడు. ఈ విధంగా రెండు ప్రార్థనా స్థలాలపై దాడి అనంతరం మూడోదాని వైపు వెళుతుండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తన తండ్రి కాలిని పట్టుకుని ఉన్న మూడేళ్ల ఓ చిన్నారిని కూడా కాల్చేసినట్లు అధికారులు తెలిపారు. అతనను పక్కా ప్రణాళిక ప్రకారమే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. బ్రెటన్ టారాంట్‌పై 51 హత్యలు, 40 హత్యాయత్నాలు, తీవ్రవాదం తదితర నేరాలపై విచారణ జరుగుతోంది. కాగా, నిందితుడు తన కేసును తనే వాదించుకోవటం గమనార్హం. టారాంట్ తీవ్రవాద భావాల ప్రచారానికి న్యాయస్థానం వేదిక కారాదనే ఉద్దేశంతో.. ఇతని వాదనలను మీడియాలో ప్రచురించడాన్ని కోర్టు నిషేధించింది.

# అనేక జీవజాతులకు కరోనా ముప్పు

**లాస్ ఏంజెలెస్:** కొవిడ్-19కు కారణమవుతున్న కరోనా వైరస్‌తో ముప్పు మానవులకే పరిమితం కాదని అమెరికా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. తీవ్రస్థాయిలో అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్న అనేక వానర జాతులకూ ఈ మహమ్మారితో ప్రమాదం ఉందని తేల్చారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ పరిశోధన చేశారు. మానవుల కణాల్లోకి ప్రవేశించడానికి కరోనా వైరస్.. ఏసీఈ2 గ్రాహక ప్రొటీన్‌ను ఉపయోగించుకుంటుంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తలు వివిధ జీవ జాతుల్లో ఈ ప్రొటీన్ నిర్మాణ తీరును పరిశీలించడానికి జన్యు విశ్లేషణను చేపట్టారు. ముక్కు, నోరు, ఊపిరితిత్తుల్లోని పైపూత సహా అనేక కణాలు, కణజాలాల్లో ఈ ప్రొటీన్ ఉంటుంది. ఏసీఈ2లో అనేకరకాల అమినో ఆమ్లాలు ఉంటాయి. వీటిలో 25 ఆమ్లాలు కరోనా కారక వైరస్ మానవ కణాల్లో ప్రవేశించడానికి వీలు కల్పిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎన్ని జాతుల్లో ఈ రకాలు ఉన్నాయన్నది దృష్టి సారించారు. ఈ మహమ్మారి సోకే ప్రమాదం ఉన్న జీవజాతుల్లో 40 శాతం జాతులు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని తేల్చారు. మానవుల నుంచి వీటికి వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వారు తెలిపారు. ఈ మహమ్మారి విజృంభిస్తున్న వేళ.. అటు మానవులతోపాటు ఇటు జంతువుల ఆరోగ్యంపైనా దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను తమ పరిశోధన వెలుగులోకి తెచ్చిందన్నారు.

# మారితే.. చైనా ఎందుకవుతుంది?

**దక్షిణ చైనా సముద్రంలో బాంబర్ విమానాల మోహరింపు**




దుందుడుకు చైనా మరోసారి తెంపరి తనం చూపించింది. దక్షిణ చైనా సము ద్రంలోని వివాదాస్పద దీవుల్లో బాంబర్ విమానాలను మోహరించింది. అక్కడి ప్రశాంత పరిస్థితులను ఉద్రిక్తంగా మార్చింది. భారత్‌లో వియత్నాం రాయబారి ఫామ్ సన్ చౌ ప్రభుత్వానికి ఈ సమాచారం అందించారు. భారత్, వియత్నాం మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యం అవసరమని నొక్కిచెప్పా రు. చాలా కాలంగా దక్షిణ చైనా సము ద్రంలోని పరాసల్ దీవులపై వివాదం నెలకొంది. అవి తమ ప్రాదేశిక ప్రాంతంలోనివే అని వియత్నాంను చైనా బెదిరిస్తోంది. కాగా వియత్నాంకు మద్దతుగా అమెరికా అక్కడ సైన్యాన్ని మోహరించింది. ఈ నేపథ్యంలో అక్కడి పెద్దదైన వుడీ దీవిలో హెచ్-6జే బాంబర్‌ను చైనా ఈ నెలంతా మోహరి స్తుందని వార్తలు వచ్చాయి. అది యూఎస్ యుద్ధ విమానాల ప్రభావాన్ని తగ్గించగలదని గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. చైనా తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తోందని వియత్నాం భారత్‌కు తెలిపింది. ఆ ప్రాంతంలో పరిస్థితులను డ్రాగన్ ఉద్రిక్తంగా మార్చిందని వెల్లడించింది. మన రెండు దేశాల మధ్య వ్యూహాత్మక రక్షణ సంబంధాలు మరింత పటిష్ఠం చేసుకోవాలని కోరింది. డ్రాగన్ వ్యతిరేకిస్తున్నప్పటికీ దక్షిణ చైనా సముద్రం తీరంలో చమురు, సహజవాయు నిక్షేపాలను అన్వేషించేందుకు భారత్ సహకారం కోరింది. కాగా తమ వద్ద గస్తీ పడవలు కొనుగోలు చేసేందుకు వియత్నాంకు భారత్ 100 మిలియన్ డాలర్ల రుణం ఇచ్చింది. ఇంకా రక్షణ సామగ్రిని కొనుగోలు చేసేందుకు మరో 500 మిలియన్ డాలర్లు ఇచ్చేందుకు అంగీకరించింది.

# మోదీ ప్రసంగం ప్రస్తావనతో ట్రంప్ ప్రచారం



**వాషింగ్టన్:** ప్రధాని మోదీ ప్రసంగమే ప్రధాన ఆకర్షణగా ఎన్నికల ప్రచార వీడియోను రిపబ్లికన్ పార్టీ విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనుండడంతో 'మరో నాలుగేళ్లు' పేరుతో 107 సెకన్ల నిడివిగల తొలి ప్రచార వీడియోను ఆవిష్కరిం చింది. ఇండియన్-అమెరికన్ ఓటర్లను ఆకర్షించాలన్న లక్ష్యంతో దీన్ని రూపొందించింది. గతంలో హ్యూస్టన్‌లో జరిగిన హౌడీ మోదీ బహిరంగ సభలో మోదీ చేసిన ప్రసంగంలోని పలు అంశాలను ఇందులో పొందుపరిచింది. "ఈయన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఈయనను పరిచయం చేయాల్సిన అవసరం లేదు. దాదాపుగా ప్రతి సమావేశంలోనూ ఈయన పేరు ప్రస్తావనకు వస్తుంది" అంటూ ప్రజల హర్షామోదాల మధ్య మోదీ అన్న మాటలతో ఈ వీడియో ప్రారంభమవుతుంది. "ఈయనను నా కుటుంబానికి పరిచయం చేస్తున్నాను" అంటూ ఇండియన్-అమెరికన్లను ఉద్దేశించి మోదీ అన్న మాటలకు కూడా ప్రాధాన్యం లభించింది. అహ్మదాబాద్‌లో ట్రంప్ చేసిన ప్రసంగం వివరాలు కూడా ఇందులో ఉన్నాయి. "అమెరికా భారత్‌ను ప్రేమిస్తుంది. గౌరవిస్తుంది. భారత్ ప్రజలకు ఎల్లప్పుడూ నమ్మకమైన స్నేహితునిగా ఉంటుంది" అంటూ ట్రంప్ చేసిన ప్రసంగం దీంట్లో ఉంది. అమెరికన్-ఇండియన్లు అమెరికా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, వారంతా అద్భుతమైన వ్యక్తులంటూ ప్రశంసించిన మాటలను కూడా ఇందులో పొందుపరిచారు. దీనిని ట్రంప్ విక్టరీ ఇండియన్ అమెరికన్ సహ ఛైర్మన్ అల్ మాసన్ ఆధ్వర్యంలో రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ఇండియన్ అమెరికన్లు డెమొక్రాటిక్ పార్టీకి ఓటు వేస్తుంటారని, కానీ ఈసారి రిపబ్లికన్ పార్టీవైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

# అమెరికా నిర్ణయంపై ఇక కోర్టుకే..! టిక్‌టాక్




**న్యూయార్క్:** టిక్‌టాక్ యాప్‌ను అమెరికాలో నిషేధించేందుకు ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఇక కోర్టులోనే అడ్డుకుంటామని ఆ సంస్థ స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయాలను సవాలు చేస్తూ త్వరలోనే కోర్టులో దావా వేయనున్నట్లు ప్రకటించింది. తమ వాదనను వినేందుకు అమెరికా పాలనా విభాగం సుముఖంగా లేకపోవడంతో దీన్ని న్యాయస్థానంలో సవాలు చేసేందు కు సిద్ధమైనట్లు వివరించింది. టిక్‌టాక్ యాజ మాన్య హక్కులను అమెరికా సంస్థలకు బదిలీ చేయకపోతే నిషేధిస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. దీని కోసం తొలుత 45రోజుల గడువు ఇచ్చినప్పటికీ అనంతరం 90రోజులకు పొడగిస్తూ అమెరికా నిర్ణయం తీసుకొంది. ఈ సమయంలో ప్రభుత్వంతో సంప్రదింపుల కోసం అన్నిదారులు మూసుకుపోయినట్లు టిక్‌టాక్ అభిప్రాయ పడింది. 'టిక్‌టాక్ విషయంలో మా స్పందనను వినేందుకు అమెరికా ప్రభుత్వం సుముఖంగా లేదు. ఈ సమయంలో చట్టాన్ని అతిక్రమించ లేదని, మా సంస్థతోపాటు వినియోగదారులు చట్టబద్ధంగా నడుచుకున్నామని నిరూపించుకోవడానికి మాకున్న ఏకైక మార్గం న్యాయవ్యవస్థనే. అందుకే ట్రంప్ సంతకం చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను సవాలు చేస్తూ ఈ వారం రోజుల్లోనే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం' అని టిక్‌టాక్ అధికార ప్రతినిధి జోష్ గార్ట్నర్ వెల్లడించారు. ఇదిలాఉంటే, టిక్‌టాక్ అమెరికా వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు మైక్రోసాఫ్ట్ చర్చలు జరిపిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సామాజిక మాధ్యమ దిగ్గజాల్లో ఒకటైన ట్విటర్ కూడా టిక్‌టాక్ కొనుగోలుకు ఆసక్తి చూపుతోంది. ఇక ఇప్పటికే ఈ యాప్‌పై నిషేధం ఉన్న భారత్‌లో దీన్ని సొంతం చేసుకునేందుకు రిలయన్స్ కూడా టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డాన్స్‌తో చర్చలు కొనసాగిస్తున్నట్లు వార్తలు వచ్చాయి.

# ఆ బస్ టికెట్ ఖరీదు ? 15లక్షలు.. ఎందుకంటే?




**దిల్లీ:** అదేంటి బస్సులో ప్రయాణానికి రూ.15 లక్షలా..? అని ఆశ్చర్యపోకండి! ఎందుకుంటే ఆ బస్సు వెళ్లేది దేశ రాజధాని దిల్లీ నుంచి బ్రిటన్ రాజధాని లండన్‌కు మరి. వినటానికి వింతగా ఉన్నా ఇది నిజం. అంతదూరం బస్సులో ప్రయాణమా అని మరోసారి ఆశ్చర్యపోకండి. ఎందుకంటే ఇది మామూలు ప్రయాణం కాదు.. సాహస యాత్ర. 'బస్ టు లండన్' పేరుతో ఈ సాహస యాత్రకు గురుగ్రామ్‌కు చెందిన అడ్వెంచర్స్ ఓవర్ ల్యాండ్ అనే ట్రావెల్ సంస్థ శ్రీకారం చుట్టింది. 18 దేశాల గుండా 70 రోజుల పాటు 20 వేల కి.మీ ఈ ప్రయాణం సాగనుంది. ఇందులో భాగంగా మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, చైనా, కిర్గిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కజకిస్థాన్, రష్యా, లాట్వియా, లిథువేనియా, పోలాండ్, చెక్ రిపబ్లిక్, జర్మనీ, నెదర్లాండ్స్, బెల్జియం, ఫ్రాన్స్ దేశాల గుండా ఈ బస్సు వెళుతుంది. 20 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ ప్రత్యేక బస్సులో ఇద్దరు డ్రైవర్లు, ఓ గైడ్, సహాయకుడు ఉంటారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బస్సులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రయాణానికి వెళ్లాలనుకునేవారికి వీసా, భోజన వసతి సదుపాయాలు సంబంధిత ఏర్పాట్లు కూడా ట్రావెల్ సంస్థే చూసుకుంటుంది. షెడ్యూల్ ప్రకారం మే 21న ఈ ప్రయాణం ప్రారంభం కావాల్సి ఉండగా.. కరోనా కారణంగా ఇంకా రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టలేదని సంస్థ తెలిపింది. ప్రయాణికులు మొత్తం అన్ని దేశాలు కాకుండా తాము కోరుకున్న దేశాల వరకు కూడా వెళ్లే వెసులుబాటు ఉంది. ఆ మేరకే టికెట్ ధర కూడా ఉంటుంది. అయితే దిల్లీ నుంచి లండన్ ప్రయాణ టికెట్ ధర మాత్రం రూ.15 లక్షలుగా సంస్థ నిర్ణయించింది.

# పరీక్షలు వాయిదా వేయండి: మమతా బెనర్జీ



**కోల్‌కతా:** విద్యార్థుల క్షేమం దృష్ట్యా జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(ఎన్‌ఈఈటీ-నీట్), సంయుక్త ప్రవేశ పరీక్ష (జేఈఈ)-2020 పరీక్షలను వాయిదా వేయాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కరోనా వ్యాపిస్తున్న తరుణంలో పరిస్థితులు చక్కబడేంత వరకు వేచి చూడాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె మాట్లాడుతూ.. "సెప్టెంబరులో నీట్, జేఈఈ నిర్వహించాలని విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ విషయంలో మరోసారి నేను కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నా. ప్రమాద తీవ్రతను అంచనా వేసి, పరీక్షలు వాయిదా వేయాలి. విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించడం మన బాధ్యత" అని పేర్కొన్నారు. కాగా ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మమత ఇదే అభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయం విదితమే. పరీక్షలు నిర్వహించాలన్న యూజీసీ గైడ్‌లైన్స్‌పై ఆమె అభ్యంతరాలు లేవనెత్తారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ సైతం పరీక్షలు వాయిదా వేయాలంటూ ఆదివారం ప్రధాని మోదీని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా ముందుగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారమే నీట్, జేఈఈ జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. కోవిడ్ కారణంగా పరీక్షలు వాయిదా వేయాలన్న విద్యార్థుల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చడంతో పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇక నీట్ ఎగ్జామ్‌కు సుమారు 16 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కరోనా సంక్షోభ నేపథ్యంలో కేంద్ర గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా పరీక్షా కేంద్రాల్లో శానిటైజేషన్ ఏర్పాట్లను చేయనున్నారు. ప్రతి విద్యార్థికి తాజా మాస్కులు, గ్లౌవ్స్‌ను అందించి సురక్షిత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

# 'కాంగ్రెస్ నాకు ఉప ముఖ్యమంత్రి ఆఫర్ ఇచ్చింది'




**భోపాల్ :** అధికారంలోకి వచ్చేందుకు తప్పుడు హామీలతో కాంగ్రెస్ మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రజలను ద్రోహం చేసిందని బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా ఆరోపించారు. రాష్ట్రంలోని గ్వాలియర్‌లో మూడు రోజుల బీజేపీ మెంబర్ షిప్ (పార్టీ సభ్యత్వ నమోదు) కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జ్యోతిరాదిత్య మాట్లాడుతూ.. 2018 రాష్ట్ర ఎన్నికల తరువాత తను ఇంకా కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా పదివిని ఇస్తానని కాంగ్రెస్ అగ్ర నాయకత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. అయినప్పటికీ ఆ ఆఫర్‌ను తిరస్కరించి.. తను ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించునట్లు తెలిపారు. కాగా కాగా, మార్చిలో కాంగ్రెస్‌ను వీడిన సింధియా.. మధ్యప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటులో కీలక భూమిక పోషించిన సంగతి తెలిసిందే. సింధియా వెంట ఉన్న 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడి బీజేపీకి మద్దతు తెలుపడంతో.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారం చేపట్టారు. అయితే సింధియా కాంగ్రెస్ తనకు ఈ పదవి ఇచ్చిందని బహిరంగంగా అంగీకరించడం ఇదే తొలిసారి. 'కమల్ నాథ్, దిగ్విజయ్ సింగ్ 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నాశనం చేస్తారని నాకు అర్థమైంది. పార్టీ అధికారంలోకి రావడానికి 10 రోజుల్లో వ్యవసాయ రుణాన్ని మాఫీ చేస్తాం వంటి తప్పుడు వాగ్దానాలతో ప్రజలకు ద్రోహం చేశారు. కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ 10 రోజుల్లో రూ .2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తారని, లేకపోతే పదకొండవ రోజున ముఖ్యమంత్రిని తిరిగి పంపిస్తామని హామీ ఇచ్చారు" అని ఆయన అన్నారు. సింధియాకు మధ్యప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పదవిని ఆఫర్ చేశారని ఈ ఏడాది మార్చిలో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు దిగ్విజయ సింగ్ అన్నారు. అయితే ఈ విషయాన్ని కమల్ నాథ్ కొట్టిపారేశారు.




# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని సర్వనాశనం చేస్తోంది

## మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు




**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 24 :** అమరావతి రాజధాని పోరాటానికి 250 రోజులు పూర్తి అయిన సందర్భంగా సంఘీభావంగా సేవ్ అమరా వతి అంటూ ప్లే కార్డుతో నిరసన తెలిపారు. అమరావతిని విస్మరిస్తే ఆంధ్రప్రదేశ్ విపరీత పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని సుజయ్ కృష్ణ రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా ప్రతిసారి రాజధాని ఎక్కడైనా మారుతుందా అంటూ జగన్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి వరకు అమరావతి రాజధాని కోసం వెచ్చించిన వేల కోట్ల రూపాయిల ప్రజాధనాన్ని జగన్ ప్రభుత్వం భాధ్యత వహిస్తుందా అని ప్రశ్నించారు. రాజధాని అమరావతి పోరాటం కేవలం ఆప్రాంత వాసుల పోరాటం కాదని ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షగా జగన్ గుర్తించాలని డిమాండ్ చేశారు. విశాఖ అతివేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా ఏనాడో అంతర్జాతీయ ఖ్యాతి సాధించిందని సుజయ్ కృష్ణ రంగారావు అన్నారు. అమరావతి రాజధానికి పూర్తి స్థాయిలో వనరులు సమకూరుస్తే రాష్ట్రానికి ఆర్థిక వనరులు అందించే స్థాయికి చేరేదని స్పష్టం చేశారు. జగన్ తీరుతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని మండిపడ్డారు.



భారత సంచార నిగం లిమిటెడ్ ఎక్జిక్యూటివ్ మెంబర్షిప్ వెరిఫికేషన్ సంబంధించిన ఈ ఎన్నికలలో పోటీ చేసిన మొదటిసారే ఆల్ ఇండియా గ్రాడుయేట్ ఇంజనీర్ మరియు టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ అఖండ విజయం సాధించి నూతన శకానికి నాంది పలికింది. ఈ సందర్భంగా అసోసియేషన్స్ సభ్యులందరూ బాణా సంచా పేల్చి , మిఠాయి లు పంచి, పూల వర్షం కురిపించి తమ విజయానందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సేవ కార్యదర్శి అలుగు వెంకటరావు, బి యస్ ఎన్ ఎల్ ఇ యు కార్యదర్శి పాపారావు లు ఆల్ ఇండియా గ్రాడుయేట్ ఇంజనీర్ మరియు టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి మురళీధర్ , కార్యదర్శి వంగపండు రమేష్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లి ఉమా మహేంద్ర లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాలినాయుడు, జగదీశ్, రాజకుమార్, ప్రవీణ్ కుమార్, వెంకట రమణ, వెంకట రావు, రాము తదిత రులు పాల్గొన్నారు.

– వార్తావళి, విజయనగరం

# డిపార్ట్మెంటల్ పరీక్షలు వాయిదా

## ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు

**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 24 :** కోవిడ్–19 దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించనున్న డిపార్ట్మెంటల్ పరీక్షలు వాయిదా వేసినట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి పి.ఎస్.ఆర్. ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుండి సెప్టెంబరు 1వ తేది వరకు (ఈనెల 29, 30వ తేదీలు తప్ప) నిర్వహించనున్న పరీక్షలు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

# రాజధానిపై బీజేపీ రెండు నాలుకల ధోరణి సరికాదు

**సాలూరు, వార్తావళి, ఆగస్ట్ 24 :** రాజధాని అంశం రాష్ట్రానికి సంభందించినదని ఒక పక్క, అమరావతికే మద్దతు అంటూ మరోపక్క బీజేపీ రెండు నాలుకలతో మాట్లాడటం సరికాదని, కేంద్రం జోక్యం చేసుకుంటే తక్షణమే రాజధాని సమస్య పరిష్కారం అవుతుందని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె. దయానంద్ అన్నారు. రాజధాని రైతులు చేపట్టిన దీక్షలు 250 రోజులకు చేరుకున్న సందర్భంగా రాష్ట్ర కమిటీ సూచన మేరకు సోమవారం నాడు పార్టీ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజనతో అన్ని విధాలుగా నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇచ్చి ఆదుకోవాల్సిన కేంద్రం రాజధాని అంశంలో రాజకీయాలు చేస్తుందని ఆవేదన చెందారు. రాజధాని మార్చుకొనే అవకాశం రాష్ట్రానికి ఇస్తే ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజధానులు మారే పరిస్థితి వస్తుందని, అదే జరిగితే రాష్ట్రం మరింత నష్ట పోతుందని అన్నారు ఇప్పటికైనా రాజధాని కొరకు ప్రభుత్వానికి భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశం లో జిల్లా సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, సైలాడ రమణ పాల్గొన్నారు.




# విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీకి ఏర్పాట్లు



**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 24 :** పాఠశాల విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేయుటకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా.జి.వి.రమణకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ డా.వై.యస్.ఆర్.కంటి వెలుగు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. సమగ్ర కంటి వైద్య సేవలు ఉచితంగా అందించుటకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి 2019 అక్టోబరు 10వ తేదీన కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. ఇందులో భాగంగా మొదటి, రెండవ దశలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 12,069 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని నిర్ధారించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి 6,872 కంటి అద్దాలను బడి పిల్లలకు పంపిణి చేసామని ఆయన తెలిపారు. ఇంకా 5,197 కంటి అద్దాలను ప్రధానోపాధ్యాయులు ద్వారా పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. కోవిడ్ 19 కారణంగా పాఠశాలలు ప్రారంభించకపోవడంతో కంటి అద్దాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయలేదని ఆయన చెప్పారు. పాఠశాలలు ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావడంతో విద్యార్థులకు 5,197 కంటి అద్దాలు పంపిణీ చేయుటకు అనుగుణంగా ఆగష్టు నెలలో కంటి అద్దాలను సంబంధిత పాఠశాలలకు అందజేయాలని నిర్ణయించామని వివరించారు. సెప్టెంబర్ నెలలో పాఠశాలల ప్రారంభ సమయానికి, పాఠశాలలలో కంటి అద్దాలు పంపిణీకి అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా విద్యా శాఖ సమన్వయంతో ఆఫ్తాల్మిక్ ఆఫీసర్లతో కంటి అద్దాలను సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. కంటి అద్దాల బాక్స్ పై విద్యార్థి వివరాలు ముద్రించి ఉంటాయని ఆయన వివరించారు. తల్లిదండ్రులు గాని, సంబంధిత విద్యార్థులు గాని పాఠశాలలను సంప్రదించి కంటి అద్దాలు పొంది, ఆరోగ్య సిబ్బంది సలహా మేరకు అద్దాలను ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా విద్యార్థులు చక్కటి విద్యను అభ్యసించుటకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. జిల్లా కలెక్టరు జె నివాస్ ఆదేశాలకు అనుగుణంగా డా.వై.ఎస్.ఆర్.కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని రమణ కుమార్ చెప్పారు.

# బిజెపి కార్యాలయంలో అరుణ్ జైట్లీ ప్రధమ వర్ధంతి

**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 24 :** బిజెపి కార్యాలయంలో బీజేపీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్ర మంత్రివర్యులు అరుణ్ జైట్లీ ప్రధమ వర్ధంతిని బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీమతి రెడ్డి పావని పత్రికా ప్రకటన విడుదల చేస్తూ అరుణ్ జెట్లీ సేవలను కొనియాడటం జరిగింది. రాజకీయాల్లో ఎటువంటి వారసత్వం లేకుండా బీజేపీ అగ్ర నాయకుడుగా ఎదిగిన వ్యక్తి, న్యాయకోవిదులు, బిజెపి వ్యూహకర్తల లో ఒకరు అరుణ్ జైట్లీ గారు అన్నారు, గతంలో వాజ్పాయ్ క్యాబినెట్లో మంత్రిగానూ, ప్రస్తుత మోడీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసి అనేక సంస్కరణలకు నాంది పలికిన వ్యక్తి అన్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయకుడిగా, ప్రభుత్వంలో అదనపు సొలిసిటరల్ జనరల్ గా పనిచేసిన అరుదైన వ్యక్తి అరుణ్ జైట్లీ గారు అన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ అమలు వంటి అనేక కీలక నిర్ణయాల అమలు వెనుక నిర్ణయాత్మక పాత్ర పోషించిన టువంటి వ్యక్తి అరుణ్ జైట్లీ అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేష్ జగ్గారావు రమణ.కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.






# టెలి స్పందనకు 36 వినతులు

**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 24 :** గిరిశిఖర ప్రాంతాలలో వున్న గిరిజనుల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఈ సోమవారం వారం పార్వతీపురం ఐ.టి.డి.ఏ లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన టెలీ స్పందన కార్యక్రమానికి సబ్ ప్లాన్ మండలాలలో వున్న ప్రజల నుంచి విశేష స్పందన వ్యక్తమయ్యింది. తొలివారమే వివిధ సమస్యల పై 36 వినతులు అందాయి. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, భూ సంబంధమైన వినతులు, త్రాగునీరు, బోరు రిపేర్లు నిమిత్తం ఫిర్యాదులు వచ్చిన వాటిలో ఎక్కువగా ఉన్నాయని ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి అర్.కూర్మనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన వినతులను, ఫిర్యాదులను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఈ టెలి స్పందన కార్యక్రమానికి ఎ.పి. ఓ సురేష్ కుమార్, డి.డి ట్రైబుల్ వెల్ఫేర్ కిరణ్ కుమార్, డిప్యూటీ డి. ఎం.హెచ్. ఓ రవికుమార్ రెడ్డి, డిప్యూటీ డి. ఇ. ఓ మోహన రాయుడు, సంబంధిత సెక్టో రియల్ అధికారులు, ఏ. ఇ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులకు నిరసనగా రౌండ్‌టేబుల్

**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 24 :** రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, కుల వివక్షతకు నిరసనగా భారత కమ్యూనిస్ట్ పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో అఖిలపక్ష రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం 11గంటలకు కామ్రేడ్. ఎన్ఆర్ దాసరి క్రాంతిభవన్‌లో జరుగుతుందని ఆయన తెలిపారు.

# మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్స్, సోషల్ మీడియాపై అవగాహన పెంచుకోవాలి

## విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 24 :** రాష్ట్ర పోలీసుశాఖ, సిఐడి విభాగం మరియు సైబరు పీస్ ఫౌండేషను సంయుక్తంగా నిర్వహిస్తున్న "ఈ రక్షాబంధన్ 4 ఎస్" కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రముఖ సైబరు నిపుణుల సహకారంతో "సోషల్ మీడియా మరియు మాట్రిమోనియల్ మోసాలు – అవగాహన' అన్న అంశంపై వెబినార్ నిర్వహించి, రాష్ట్ర ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లాఎస్పీ బి.రాజకుమారి మాట్లాడుతూ – సోషల్ మీడియా, మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్స్‌పై అవగాహన లేకపోతే వివాహాల పేరుతో మహిళలు మోసపోయే అవకాశం ఉందన్నారు. కావున, ప్రతీ ఒక్కరూ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్స్ మరియు సోషల్ మీడియాపై వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్స్‌లో పెట్టే విషయాలు వాస్తవాలా? కావా? అన్న పరిశీలన తప్పనిసరిగా చెయ్యాలన్నారు. అవసరమైతే భౌతికంగా ఆయా ప్రాంతాలను సందర్శించి, వాస్తవాలను తెలుసుకున్న తరువాతనే ముందుకు వెళ్ళాలన్నారు. ఆన్‌లైను వినియోగించే సమయాల్లో మనల్ని ఆకర్షించేందుకు సైబరు నేరగాళ్ళు తప్పుడు సమాచారంతో యాడ్స్‌ను రూపకల్పన చేసి, ప్రదర్శిస్తారన్నారు. రొమాన్స్/డేటింగు స్కామ్స్, సైబర్ బుల్లీయింగు,ఫోటో మార్ఫింగు, సమాచార చోరీ, ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ ఫాలోవర్స్‌తో మనల్ని బురిడీ కొట్టేంచే వారుంటారన్నారు. సోషల్ మీడియా, మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్స్ పట్ల సైబరు నిపుణులు సిఐడి అదనపు డిజి పివి సునీల్ కుమార్, సిఐడి సైబర్ క్రైం ఎస్పీ జిఆర్ రాధిక, సిఐడి మహిళా ప్రొటక్షను సెల్ ఇన్‌చార్జ్ ఎస్పీ కెజివి సరిత, సైబర్ పీస్ ఫౌండేషను ప్రతినిధి ఐఎల్ఎన్ రావు పాల్గొని మహిళలు, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారని విజయనగరం జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి తెలిపారు.


# ఆశ్రమంలోని వృద్ధులకు శ్రీ ఆదిభట్ల ఫౌండేషన్ వితరణ




**ఎస్ కోట, వార్తావళి, ఆగస్ట్ 24 :** హరికధ పితామహుడు శ్రీ మదజ్జాడా అదిభట్ల నారాయణదాసు 156 వ జయంతోత్సవాలు సందర్భంగా జామి మండల అట్టాడ బీఎన్ఆర్ ఆశ్రమంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు అందించడం తమకు ఏంతో ఆనందంగా ఉందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అదిభట్లనారాయణ దాస్ ముని మనవడు ఆనంద నారాయణ దాసు అన్నారు సోమవారం ఆశ్రమం లో వితరణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నారాయణదాసు గారి జయంతి ఉత్సవాలను జిల్లాలో అన్ని చోట్ల విస్తృతంగా తమకున్న స్థాయిలో చేస్తున్నామని అందులో భాగంగానే ఈ రోజు కార్యక్రమం చేశామని చెప్పారు,నారాయణ దాసు గారి గుర్తుగా త్వరలోనే వృద్ధులు లకు హరికథ ఏర్పాటు చేస్తామని తెలిపారు,భీశెట్టి ఫౌండేషన్ అదినేత భీశెట్టి బాబ్జి మాట్లాడుతూ ఆనందనారాయణ దాసు తన తాతగారి పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, బీఎన్ఆర్ ఆశ్రమంలో వృద్ధులుకి చేసిన వితరణ కార్యాక్రమంకి ధన్యవాదాలు తెలియచేస్తున్నామని అన్నారు ఆశ్రమం కమిటీ సభ్యులు పూసర్ల రాజేశ్ తోపాటుగా నారాయణదాసు ఫౌండేషన్ ప్రతినిధులు ఫణిశ్రీకాంత్, ప్రకాష్, రామా,రాంబాబు,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వైరస్ నియంత్రణకు పంచ సూత్రాలు పాటించాలి

## విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 24 :** కరోనా వైరస్ విస్తృతంగా వ్యాపిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, కరోనా నియంత్రణకు ముఖ్యంగా పంచసూత్రాలు పాటించాలని విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి సోమవారం అన్నారు. విజయనగరం పట్టణంలో భద్రతా ఏర్పాట్లును సమీక్షించేందుకు గాను జిల్లా ఎస్పీ బి.రాజకుమారి ఆగష్టు 24న విజయనగరం పట్టణంలో బాలాజీ జంక్షన్, కోట జంక్షన్, మూడు లాంతర్లజంక్షన్ గంటస్థంబం, కన్యకాపరమేశ్వరి టెంపుల్, ఆర్.టి.సి కాంప్లెక్స్ తదితర ప్రాంతాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లును సమీక్షించారు. కరోనా వైరస్ విస్తృత స్థాయిలో వ్యాపిస్తున్న దృష్ట్యా ప్రజలకు కరోనా నియంత్రణ చర్యలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని, కరోనా అవేర్నెస్ బృందాలకు మరియు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ – కరోనా కట్టడికి ముఖ్యంగా పంచ సూత్రాలను పాటించాలన్నారు. నోరు, ముక్కు పూర్తిగా మూసివేసినట్లుగా మాస్కు ధరించాలని మరియు తప్పనిసరిగా ఫేస్షీల్డు ధరించాలని, ఇతరులకు ఆరు అడుగుల దూరం పాటించాలని, చేతులను తరుచూ సానిటైజరు లేదా సబ్బుతో శుభ్రం చేసుకోవాలని, వేడినీరు త్రాగాలని మరియు ప్రతీ రోజూ రెండుసార్లు ఆవిరి పట్టాలని, అదే విధంగా రోజుకు రెండుసార్లు బెటాడిన్ ద్రావణంతోగాని పసుపు, ఉప్పు కలిపిని నీటితో నోటిని పుక్కిళ్ళించడం చేయాలన్నారు. కరోనా నిర్ధారణ కొరకు చేయించుకున్న కోవిడ్ 19 పరీక్ష ఫలితాలు తెలిసేంతవరకు గృహ నిర్భందంలోనే ఉండాలని జిల్లా ఎస్పీ అన్నారు. కోరానా పాజిటివ్గా నిర్ధారణ అయితే ఆందోళన చెందవద్దన్నారు. గతంలో ఏమైనా తీవ్రమైన వ్యాధులతో అనగా హృద్రోగం, కిడ్నీ, సుగర్, బిపి వంటి వ్యాధులతో బాధపడుతున్నట్లయితే వెంటనే కోవిడ్ ఆసుపత్రిలో చేరాలన్నారు. అలా కాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయితే హెూం ఐసోలేషనులో ఉండి, డాక్టరు లేదా ఆరోగ్య కార్యకర్త సలహా మేరకు చికిత్స పొందవచ్చునన్నారు. తీవ్రమైన జ్వరం, జలుబు వంటి కరోనా లక్షణాలు ఉన్నట్లయితే కోవిడ్ 19 నిర్ధారణ పరీక్షచేయించుకోవాలన్నారు.

# స్పందనకు 123 వినతులు: జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి

**శ్రీకాకుళం, వార్తావళి, ఆగస్ట్ 24 :** స్పందన కార్యక్రమానికి 123 వినతులు అందాయి. సోమవారం ఉదయం స్పందన కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, కలెక్టర్ కార్యాలయం హెచ్.సెక్షన్ సూపరింటెండెంట్ అప్పారావు, భాస్కరరావులు నిర్వహించారు. ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ కలెక్టర్, స్పందన కార్యక్రమాల్లో ప్రజల ఆర్జీలను భౌతికంగా కాకుండా ఫోన్ ద్వారా స్వీకరించేందుకు ప్రతీ సోమవారం ఉదయం 09.00గం.ల నుండి మధ్యాహ్నం 12.00గం.ల వరకు స్వీకరిస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాలకు చెందిన 123 మంది ఆర్జీదారులు తమ ఫిర్యాదులను జిల్లా రెవిన్యూ అధికారికి విన్నవించారు. వజ్రపు కొత్తూరు మండలం కొండపూర్ నుండి మెట్టా గౌరి ఫోన్ చేస్తూ తమ గ్రామంలోని స్వంత పొలాల్లో అక్రమంగా కాలువలు, సి.సి.రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారని, కావున బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు.నగరపాలక సంస్థ పరిధిలోని ఏనుగుల మహల్ వీధి నుండి దుర్గ జోగయ్య మాట్లాడుతూ తనకు గత 7 మాసాల నుండి వృద్ధాప్యపు పింఛను మంజూరుచేయడం లేదని, తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అని సాకులు చెపుతున్నారని, కావున దీనిపై తగిన న్యాయం చేయాలని ఫిర్యాదు చేసారు.ఎచ్చెర్ల మండలం బలిజిపేట నుండి గుండు పోలారావు ఫోన్ చేసి మాట్లాడుతూ తన తండ్రికి వెన్నముక శస్త్రచికిత్స జరిగిందని, ఇందుకు సిఎం రిలీఫ్ ఫండ్ నుండి 35 వేల రూపాయలు మంజూరైందని, కావున దానిని ఇప్పించాలని కోరారు. పాతపట్నం మండలం తామర నుండి మజ్జి గిరిబాబు మాట్లాడుతూ తమకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాన్ని పేరు మార్పు చేయాలని కోరుతూ 20 రోజులు గడిచినప్పటికీ ఇంతవరకు మంజూరుచేయలేదని ఫిర్యాదు చేసారు.జలుమూరు మండలం లింగాలవలస నుండి చింతాడ ధర్మారావు మాట్లాడుతూ తనకు చెందిన రేషన్ బియ్యాన్ని గత మూడు మాసాలుగా మంజూరుచేయడం లేదని ఫిర్యాదు చేసారు.వంగర మండలం అరసాడ నుండి యం.లక్ష్మి ఫోన్ చేసి మాట్లాడుతూ పల్స్ సర్వేలో తప్పుడు సమాచారం వలన తమ కుటుంబం నుండి వేరుగా ఉన్నప్పటికీ తనకు వై.యస్.ఆర్.చేయూత పథకం వర్తింపచేయలేదని, ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు.అరసవల్లి శిమ్మ వీధికి చెందిన యస్.తవుడు మాట్లాడుతూ తన పేరును రేషన్ కార్డు నుండి తొలగించినందున రేషన్ రావడం లేదని ఫిర్యాదు చేసారు.రణస్థలం మండలం కె.లోచర్లపాలెం నుండి లోచర్ల అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వ చెరువులను పూడ్చి కొందరు అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని, కావున బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారు.నరసన్నపేట హడ్కోకాలనీ నుండి యం.లక్ష్మి మాట్లాడుతూ తనకు ఇంటిస్థలాన్ని మంజూరుచేయాలని కోరుతూ ఫిబ్రవరి మాసంలో దరఖాస్తు చేసినప్పటికీ ఇంతవరకు మంజూరుచేయలేదని ఫిర్యాదు చేసారు.బూర్జ మండలం తొగరాం నుండి సి.పద్మావతి ఫోన్ చేస్తూ రైతు భరోసా డబ్బులు ఇంతవరకు అందలేదని, గత ఏడాది కూడా మంజూరుచేయలేదని, ఇప్పటికైనా మంజూరుచేయాలని కోరారు. జి.సిగడాం మండలం తాడివలస నుండి యస్.గోపాల్ నాయుడు మాట్లాడుతూ మడ్డువలస రిజర్వాయర్ నుండి నీటిని రానివ్వడం లేదని, ఈ విషయమై ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదుచేసినప్పటికీ ఎటువంటి పరిష్కారం కాలేదని ఫిర్యాదు చేసారు. దీనివలన పంటలు దెబ్బతినే అవకాశం ఉందని, కావున నీటిని విడుదల చేయాలని కోరారు. రేగిడి మండలం కొల్లివలస నుండి జె.గణేష్ మాట్లాడుతూ తాను ఏ.పి.యస్.డబ్ల్యు.ఆర్.యస్ కొల్లివలస రెసిడెన్షియల్ స్కూల్ నందు విద్యను అభ్యసిస్తున్నానని, తమకు ప్రతీ గురువారం ఇవ్వాల్సిన గ్రుడ్లు, రైస్ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేసారు.



# సంపాదకీయం

## పునరాలోచించాలి

కరోనా వైరస్ మహమ్మారి భూగోళంపై పంజా విసరడం మొదలుపెట్టి ఏడు నెలలు కావస్తోంది. దాని తీరు అర్ధం చేసుకోవడంలో, అరికట్టడంలో వైద్యరంగ నిపుణులు ఇప్పటికీ పూర్తిగా విజయం సాధించలేకపోయారు. వాక్సిన్ అందుబాటులోకొచ్చేవరకూ ఇది తప్పదు. అంతవరకూ అందరూ ఆ మహమ్మారి విషయంలో అప్రమత్తంగా వుంటూ తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షల నిర్వహణపై సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన తీర్పును ఈ నేపథ్యంలో చూడాలి. ప్రవేశ పరీక్షలు వాయిదా వేయడం కుదరదని, అవి యథాప్రకారం వచ్చే నెలలో నిర్వహిం చాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 11 రాష్ట్రాలకు చెందిన 11మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. ఆ వైరస్ కనుమరుగు కావడానికి ఎంతకాలం పడుతుందో తెలియని ప్రస్తుత పరిస్థితుల్లో వాయిదా వేయడం ఎలా సమర్థనీయమని ధర్మాసనం ప్రశ్నించింది. సమస్యలెన్నివున్నా జీవనం సాగుతూ వుండా ల్సిందేనని వ్యాఖ్యానించింది. నీట్, జేఈఈలపైనే కాదు... విశ్వవిద్యాలయాలు డిగ్రీ ఫైనలియర్ పరీక్షలను సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలంటూ యూజీసీ గత నెల 6న జారీచేసిన నోటిఫి కేషన్‌పైనా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అలాగే ఆయుష్ పోస్టుగ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలైంది. విశ్వవిద్యాలయాల పరీక్షల నిర్వ హణపై కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వెనకాడుతున్నాయి. కరోనా వైరస్ మహమ్మారిపై పౌరుల్లో నెలకొన్న భయాందోళనలకు ఈ పిటిషన్లు అద్దం పడుతున్నాయి. మన దేశంలో కరోనా కేసుల సంఖ్య పెరిగింది. రోజూ దాదాపు 60,000 కొత్త కేసులు నమోదవుతున్నాయి. అన్ని రాష్ట్రాల్లోనూ కరోనా పరీక్షల సంఖ్య పెరగడం, ప్రజల్లో చైతన్యం పెరిగి అనారోగ్యంపాలైతే స్వచ్ఛందంగా పరీక్షకు సిద్ధపడటం వల్ల ఈ స్థాయిలో కేసులు వెల్లడవుతున్నా యనుకోవచ్చు. కరోనాకు ఇంతవరకూ మందు లేదు. అయితే దాన్ని అరికట్టడంలో తోడ్పడుతున్నాయని నిర్ధారణ అయిన వేరే వ్యాధుల ఔషధాలను వ్యాధిగ్రస్తులకు వినియోగిస్తున్నారు.రోగి లక్షణాలను బట్టి వివిధ మందులతో చికిత్స చేస్తున్నారు. కరోనా వచ్చి తగ్గినవారిలో లభించే సీరమ్‌తో కూడా రోగులకు చికిత్స అందిస్తున్నారు. వీటన్నిటివల్లా రికవరీ రేటు చెప్పుకోదగ్గ రీతిలో పెరిగింది. అదే సమయంలో కొన్ని రాష్ట్రాలు కరోనా నిర్ధారణ పరీక్షల విషయంలో ఇంకా వెనకబడేవున్నాయి. వెల్లడైన కేసులతో పోలిస్తే వ్యాధిగ్రస్తులు మూడు రెట్లు ఎక్కువ వుండొచ్చని హైదరాబాద్ నగరంలో పరిశోధన చేసిన సీసీఎంబీ సంస్థ అంచనా వేస్తోంది. మొన్న మే నెలవరకూ ఆ వ్యాధిని అరికట్టడంలో విజయం సాధించినట్టే కనిపించిన కేరళలో ఆ తర్వాత క్రమేపీ కేసుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇవన్నీ పరిస్థితుల తీవ్రతను తెలియజేస్తున్నాయి. రెండురోజులక్రితం ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన ప్రకటన కూడా గమనించదగ్గది. ప్రస్తుతం 20-40 ఏళ్ల వయసులోవున్నవారి వల్ల కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తోందని ఆ సంస్థ హెచ్చ రించింది. ఈ వయసువారు కరోనా బారినపడినా లక్షణాల జాడ లేకపోవడంతో యధేచ్ఛగా తిరుగు తున్నారని, పర్యవసానంగా వ్యాధి వ్యాపిస్తోందని వివరించింది. పరీక్షలు నిర్వహించే ముందు ఇలాంటి అంశాలన్నీ పరిగణనలోకి తీసుకోక తప్పదు. విద్యార్థుల కెరీర్ చాలా ముఖ్యమే. నీట్, జేఈఈ పరీక్షలు ఏప్రిల్, మే నెలల్లో జరగాల్సివుంది. ఈ పరీక్షలేమిటి... సీబీఎస్ఈ వార్షిక పరీక్షలు మొదలుకొని దాదాపు అన్ని పరీక్షలూ అప్పటినుంచీ వాయిదాలు పడుతూనే వున్నాయి.కొన్ని రాష్ట్రాలు చేసేది లేక టెన్త్, ఇంటర్ విద్యార్థులను పరీక్షలతో సంబంధం లేకుండా ఉత్తీర్ణులను చేయాల్సివచ్చింది. తరగతుల నిర్వహణ సమస్యగా మారడంతో ఆన్‌లైన్ బోధనవైపు మొగ్గుచూపే ధోరణి పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల కెరీర్ అయోమయంలో పడుతుందన్న ఒక్క కారణంతో ప్రవేశ పరీక్షలు యధావిధిగా జరపాలనడంలో సహేతుకత ఏమిటో అర్థంకాదు. నీట్‌కు 17 లక్షలమంది, జేఈఈకి 11 లక్షలమంది హాజరుకావాల్సివుంది. ఈ పరీక్షల్ని పకడ్బందీ జాగ్రత్తలు తీసుకుని జరుపుతామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తారనడంలో సందేహం లేదు.

# చరిత్రలో ఆగస్ట్ 25

# తెలుగు సాహితీకారుడు సురవరం వర్ధంతి

**1609 : గెలీలియో గెలీలి మొదటి సారిగా తాను తయారు చేసిన టెలిస్కోపు ప్రదర్శించాడు.**

**1867 : ఆంగ్ల రసాయన శాస్త్రవేత్త, భౌతిక శాస్త్రవేత్త మైకేల్ ఫెరడే మరణం (జ.1791).**

**1952 : శ్రీలంకకు చెందిన మాజీ క్రికెట్ ఆటగాడు దులీప్ మెండిస్ జననం.**

**1953 : తెలుగు సాహితీకారుడు సురవరం ప్రతాపరెడ్డి మరణం (జ.1896).**

**1961 : అమెరికా సంగీత గాయకుడు, గీత రచయిత, నటుడు బిల్లీ రే సైరస్ జననం.**


**1962 : బంగ్లాదేశ్ కు చెందిన రచయిత్రి తస్లీమా నస్రీన్ జననం.(చిత్రంలో)**

**1969 : కార్మిక నాయకుడు, ఉర్దూకవి మఖ్దూం మొహియుద్దీన్ మరణం (జ.1908).**

**1987 : అమెరికా టీ.వీ., సినిమా నటి బ్లేక్ లైవ్లీ జననం.**

**1999 : తత్వవేత్త, చిత్రకారుడు, రచయిత, కవి సూర్యదేవర సంజీవదేవ్ మరణం (జ.1924).**

**2012 : చంద్రునిపై మొట్టమొదట కాలుమోపిన వ్యక్తి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మరణం.(జ.1930)**



తెలంగాణ రాజకీయ, సాంఘిక చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి (మే 28, 1896 – ఆగస్టు 25, 1953). పత్రికా సంపాదకుడుగా, పరిశోధకుడుగా, పండితుడుగా, రచయితగా, ప్రేరకుడుగా, క్రియాశీల ఉద్యమకారు డుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైనవి. స్థానిక చరిత్రల గురించి, స్థానిక ప్రజల కడగండ్ల గురించి అతను పడిన నిరంతర తపనకు ప్రతి అక్షరం ప్రత్యక్ష సాక్ష్యం. తెలంగాణలో కవులే లేరనే నిందావ్యాఖ్యలను సవాలుగా తీసుకొని 354 కవులతో కూడిన "గోల్కొండ కవుల సంచిక" గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సురవరం ప్రతాపరెడ్డి ఒక అధ్యాయం. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఫారసీ, ఆంగ్ల భాషలలో నిష్ణాతులు. గోల్కొండ పత్రిక, దానికి అనుబంధంగా భారతి సాహిత్య పత్రిక, ప్రజావాణి పత్రికలను స్థాపించి సంపాదకుడిగా, పత్రికా రచయితగా ప్రసిద్ధి చెందాడు. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హిందువుల పండుగలు, హైందవ ధర్మవీరులు, గ్రంథాలయోద్యమము ఇతని ఇతర ముఖ్య రచనలు. నైజాం నిరంకుశ పాలనలో, తెలుగు వారి అణచివేతను వ్యతిరేకిస్తూ సురవరం ప్రజలను చైతన్య వంతం చేసేందుకు, తెలుగు భాషా సం స్కృతుల వికాసానికి ఎనలేని కృషిచేశా డు. జీవిత చివరి దశలో రాజకీయా లలో కూడా ప్రవేశించి వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యాడు. తెలుగుజాతికి ఇతను చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ప్రతిష్ఠించిన విగ్రహాలలో సురవరం విగ్రహం కూడా స్థానం పొందింది. 1955లోనే ఆంధ్రుల సాంఘిక చరిత్ర రచనకు గాను "కేంద్ర సాహిత్య అకాడమి" అవార్డు లభించింది. సురవరం ప్రతాపరెడ్డి 1896 మే 28న మహబూబ్ నగర్ జిల్లాలోని ఇటిక్యాల పాడులో రంగమ్మ, నారాయణరెడ్డి దంపతులకు జన్మించాడు. ప్రతాపరెడ్డి తండ్రి చిన్నతనం లోనే మరణించారు. అతను చిన్నాన్న రామకృష్ణారెడ్డి వద్ద పెరిగి ఎబియం మిషనరీ పాఠశాలలో ప్రాథమిక విద్యను హైదరాబాద్ నిజాం కళాశాలలో ఇంటర్మీ డియట్, మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎ. చది వాడు. 1916లో మరదలు పద్మావతిని వివాహం చేసుకున్నాడు. సంతానం పదిమందికాగా, ఇద్దరు కుమారులు విగతజీవులు. నలుగురు కుమారులు, నలుగురుపుత్రికల సంతానం. సురవరం ప్రతాపరెడ్డి తన చదువు పూర్తికాగానే హైదరాబాద్ కొత్వాల్‌గా వున్న రాజబహదూర్ వేంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలోని రెడ్డి హాస్టల్‌కు అతను కోరికపై వచ్చాడు. ఇక్కడ అతను పనిచేసిన దశాబ్ది కాలంలో రెడ్డి హాస్టల్ నిర్వహణను ఒక విద్యాలయంగా తీర్చిదిద్దాడు. నాటి నైవాసిక విద్యార్థులలో దేశభక్తి బీజాలను నాటారు. 1924 ప్రాంతంలో ఈ హాస్టల్ వదాన్యుల సహ కారంతో స్థాపించబడింది. ఆ విధంగా హైదరా బాద్‌లో రెడ్డి సాంఘిక సేవా జీవితం పునాదులు వేసింది. మద్రాస్ కళాశాలలో చదువుతున్నప్పుడే నాటి జాతీయ ఉద్యమ ప్రభావం అతనుపై పడింది. నిజాం రాష్ట్రాంధ్ర దుస్థితి రూపురేఖలను మార్చాలన్న తపన ఆనాటి నుండే సురవరం మనస్సులో నాటుకొని పోయింది. హాస్టల్ కార్యదర్శిగా వచ్చాక, వేయి గ్రంథాలున్న హాస్టల్ లైబ్రరీని 11వేల గ్రంథాల వరకు పెంచి, విద్యార్థులలో భాషాభివృద్ధికి కృషి చేశాడు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశా లలో బి.ఏ, తిరువాన్‌కూరులో బి.ఎల్ చదివాడు. కొంతకాలం పాటు న్యాయవాద వృత్తి నిర్వహించాడు. అనేక భాషలు అభ్యసించిండు. మంచి పండితుడు. 1926లో అతను నెలకొల్పిన గోలకొండ పత్రిక తెలంగాణ సాంస్కృతిక గమనంలో మైలురాయి. గోలకొండ పత్రిక సంపాదకీయాలు నిజాం ప్రభు త్వాన్ని సూటిగా ప్రశ్నించినయి. నిజాం ఆగ్రహించి సంపాదకీయాలు సమాచార శాఖ అనుమతితోనే ప్రచురించాలని నిబంధన పెట్టిండు. దాన్ని తిప్పికొడుతూ ప్రతాప రెడ్డి ప్రపంచ మేధావుల సూక్తులను సేకరించి సంపాదకీయానికి బదులుగా ప్రచురించిండు. అది మరింత సమస్యగా ఆనాటి ప్రభుత్వం భావించింది. తెలంగాణలో కవులే లేరని ఒక ఆంధ్ర పండితుడు ఎగతాళి చేస్తే దానికి దీటుగా 350 మంది కవుల రచనలతో గోలకొండ కవుల సంచిక అనే సంకలనాన్ని 1934లో ప్రచురించి తిరుగులేని సమాధానం చెప్పాడు. ఆ సంచిక ఇప్పటికీ అపురూపమైనది. తెలంగాణాలో గ్రంథాల యోద్యమంలో ప్రతాపరెడ్డి ప్రముఖపాత్ర వహించా డు. 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించాడు. 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు, 1944లో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్తుకు అతన్ను అధ్యక్షుడు. 1951లో ప్రజావాణి అనే పత్రికను ప్రారంభించాడు. 1952 లో హైదరాబాదు రాష్టానికి జరిగిన మొదటి ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ తరపున వనపర్తి నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికయ్యాడు. న్యాయవాదిగా అతను జీవితం ప్రారంభించి, రచయితగా, కార్యకర్తగా, సంపాదకుడుగా జీవితం సాగించి తెలంగాణ ప్రజల హృదయాలలో ముద్రవేసుకున్నాడు. 1953 ఆగష్టు 25న అతను దివంగతులయ్యారు.

# దశరథుని సంతాపం

(నిన్నటి తరువాయి)



కట్టుకున్న వస్త్రాల మీది చిరుగులు కనిపించకుండా జాగ్రత్తపడ్డాడు. చేతులు జోడించాడు. చేతికర్రను ఆసరా చేసుకుని నిల్చున్నాడు."రామచంద్రా" అన్నాడు దీనంగా."చెప్పండి మహాత్మా." అడిగాడు రాముడు."నేను ఉంఛవృత్తి(రాలిన గింజల్ని ఏరుకుని జీవించడం)తో జీవించేవాణ్ణి. బ్రాహ్మణుణ్ణి. పిల్లలు గలవాణ్ణి. కనికరించు. నీకు తోచింది దానం చెయ్యి." ప్రార్థించాడు త్రిజటుడు.దానం చేసేందుకు తన దగ్గర ఇంకా ఏమేమి మిగిలి ఉన్నవీ, అవి ఎక్కడున్నవీ గుర్తు చేసుకోసాగాడు రాముడు. గుర్తు రావడం లేదేదీ. ఆలస్యంగా వచ్చి, అడిగి లేదనిపించుకోడు కదా అనుకున్నాడు రాముడు. ఆ ఆలోచనకే బాధపడ్డాడు. అంతలో గుర్తొచ్చిందతనికి. "మహానుభావా! నువ్వు కొంచెం ఆలస్యంగా వచ్చావు. దాంతో ఆలోచించాల్సి వచ్చింది. ప్రస్తుతం నా దగ్గర గోవులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అవి కూడా సరయూ నదీతీరంలో ఉన్నాయి. మేస్తున్నాయక్కడ." అని ఆగాడు రాముడు. దీనంగా చూస్తున్న త్రిజటుణ్ణీ, అతను ఆసరా చేసుకుని నిల్చున్న చేతికర్రనీ గమనించాడు. ఏదో ఆలోచన తట్టింది. తట్టిన ఆలోచనకు వస్తున్న నవ్వును ఆపుకున్నాడు రాముడు. అన్నాడిలా."ఓ పని చెయ్యి బ్రాహ్మణోత్తమా! నీ శక్తినంతా కూడదీసుకుని, నీ చేతికర్రను సరయూనదీతీరంలోని ఆవుల మధ్యకు విసురు! నీ చేతి కర్ర పడిన లోపలగల ఆవులన్నీ నీవే, నిరభ్యంతరంగా వాటిని నువ్వు తీసుకోవచ్చు."రాముణ్ణి నవ్వుతూ చూశాడు లక్ష్మణుడు. సమాధానంగా బ్రాహ్మణుని శక్తి చూద్దాం అన్న ట్టుగా కళ్ళార్చాడు రాముడు.ఎక్కడలేని ఉత్సాహాన్ని తెచ్చుకున్నాడు త్రిజటుడు. ఉత్తరీయాన్ని సవరించాడు. కాళ్ళు రెంటినీ వెనుక ముందుగా నిలిపి, గట్టిగా భూమిపై ఆన్చాడు. ఊపిరి బిగపట్టాడు. చేతికర్రను ఓసారి చూశాడు. దాన్నెత్తి, గిరగిరా తిప్పాడు. శక్తినంతటినీ కూడదీసుకుని, బలంగా కర్రని సరయూతీరానికి విసిరాడు. చిత్రంగా ఆ కర్ర, నదీతీరంలో మేస్తున్న కోటిగోవులూ, వాటి లేగలను దాటి నేలపై పడింది. అది చూసి రామలక్ష్మణులిద్దరూ ఆశ్చర్యపోయారు. అభినందిస్తూ కరతాళధ్వనులు చేశారు. "బ్రాహ్మనోత్తముని చేతికర్ర పడిన మేర గోవులూ, దూడలూ, గోపాలకులుసహా అతని ఆశ్ర మానికి తరలించండి." సేవకులకు ఆజ్ఞాపించాడు రాముడు. తర్వాత బలంగా ఉచ్ఛ్వాసనిశ్వాసలు తీస్తున్న త్రిజటుణ్ణి మెచ్చుకోలుగా చూశాడు. గట్టిగా కౌగిలించుకున్నాడతన్ని."మహానుభావా! నీ శక్తిని గుర్తించలేకపోయాను. ఎగతాళి చేశాను. నన్ను క్షమించు." అన్నాడు రాముడు. సీతాదేవిని చూశాడు. ఆమె చేతిలో ఉంగరాలూ, గాజులూ, ఏవేవో హారాలూ ఉన్నాయి."ఈ మహాత్మునికి వాటిని దానం చేసి, ఆశీస్సులందుకో సీతా." అన్నాడు రాముడు. భర్త చెప్పినట్టుగానే చేసిందామె. ఊహించని కానుకలకు ఉబ్బితబ్బిబ్బవుతూ, వారిని ఆశీర్వదించి, అక్కణ్ణుంచి నిష్క్రమించాడు త్రిజటుడు. "తండ్రిగారి ఆశీస్సులందుకుని వనవాసానికి బయలుదేరుదాం, పదండి." అన్నాడు రాముడు. సీతాలక్ష్మణులసహా బయల్దేరాడు.అప్పటికే కైక కుతంత్రం, శ్రీరామవనవాసం వార్తలు దావానలంలా నగరం అంతటా వ్యాపించాయి. పౌర జానపదు లంతా వాటి గురించే చర్చించుకుంటున్నారు. యువకులు కొందరు కైకను కడతేరుస్తామంటూ కత్తులు దూసారు. వారిని వారించారు పెద్దలు. అది రాచరికం, అందులో తాము తలదూర్చరాదన్నారు. అంతలో సీతారామలక్ష్మణులు ముగ్గురూ పాదచా రులై రాజమందిరానికి నడచి వెళ్ళడాన్ని గమనిం చారు. కన్నీరుమున్నీరయ్యారు. రామలక్ష్మణులను అనుసరిస్తూ సేవకులు లేరు. వాహనాలు లేవు. అది పౌరుల్ని మరింతగా దుఃఖితుల్ని చేసింది. 'పట్టాభిషిక్తుడై రాజ్యాన్ని పాలించాల్సినవాడు, శ్వేతఛత్రం నీడలో నడవాల్సిన రేడు, పేదవాడిలా చూడెలా నడుస్తున్నాడో? పక్కన ఒక్క సేవకుడు లేడు, ఎక్కడానికి పల్లకీలేదు." బాధపడ్డారు. "సీతాదేవి గురించి చెప్పుకోవడమే తప్పా, ఎన్నడూ ఆమెను చూడలేదు. సూర్యచంద్రులకి కూడా కనిపించని ఆ తల్లి, ఇవాళ అందరికంటా పడు తోంది. హతవిధీ!" గుండెలు బాదుకున్నారు. "సుకుమారి సీతాదేవి అరణ్యాల్లో సంచరించగలదా? ఎండవానలను తట్టుకోగలదా?" కన్నీరుపెట్టు కున్నారు. "మహారాజు దశరథుణ్ణి ఏ దెయ్యమోపట్టి పీడిస్తోంది. లేకపోతే ఇనకులాబ్ధిసోముణ్ణి, రాముణ్ణి అడవులకు పంపుతాడా? అది కైక కాదు, కైజారు. ఆ సంగతి తెలుసుకోలేకపోతున్నాడు రాజు." కోపగించుకున్నారు."లోకం చెట్టుకి, శ్రీరాముడు తల్లి వేరులాంటి వాడు. ఆ వేరును తెగ నరికి, వినోదం చూస్తోంది రాచరికం. తట్టుకోలేం." అన్నారు. "రాముడు ఎక్కడ ఉంటే అక్కడే రాజ్యం. మనం ఇక్కడ ఇక ఒక్కక్షణం కూడా ఉండవద్దు.

(మిగతా రేపటి సంచికలో)



# శ్రీ వామన విజయం!

మహిమాన్వితమైన శ్రీవామన చరిత్రను విన్నవారు నిశ్చయంగా సమస్త పాపాలనుండి బయటపడతారు. అప్పుడు వారి కష్టాలు, దుఃఖాలు వాటంతటవే నశించి పోతాయి. శ్రీవామన చరిత్ర ఫలశ్రుతిని తెలుపుతూ శ్రీశుకదేవుడు, దేవతా ప్రీత్యర్థం చేసే కర్మలలోగాని, పితృదేవతల ప్రీత్యర్థం చేసే కర్మలలోగాని, వివాహం వంటి సాంఘిక కర్మలలోగాని వామన చరిత్రను కీర్తిస్తే వారి కార్యం నిర్విఘ్నంగా అత్యంత శుభప్రదమ వుతుందని తెలియజేశాడు.

**'ఛలయసి విక్రమణే బలి మద్భుత వామన**
**పదనఖనీర జనిత జనపావన**
**కేశవధృత వామనరూప జయజగదీశ హరే'**

'ఓ కేశవా! ఓ జగదీశా! వామనరూపాన్ని ధరించిన ఓ హరీ! నీకు జయము జయము. మహోన్నతమైన అడుగులతో నువు బలి మహారాజు ఆట కట్టించావు. నీ పాద పద్మముల నుండి బయల్వెడలిన గంగాజలంతో ఈ జగత్తులోని సకల జీవులను ఉద్ధరించావు' అన్నది ఈ శ్రీవామన స్తుతి భావన. 12వ శతాబ్దానికి చెందిన సుప్రసిద్ధుడైన శ్రీ జయదేవ గోస్వామి 'శ్రీవామనదేవుని విజయం' గురించి 'దశావతార స్తోత్రం'లో రచించారు. ఈ విధంగా దేవదేవుడైన శ్రీహరి దశావతారాలలో ఒకానొక సుప్రసిద్ధ అవతారంగా శ్రీ వామనదేవుడు భక్తుల హృదయాలలో నిలిచిపోయాడు. కవులతో విశే షంగా కీర్తనలు అందుకొన్నాడు. తెలుగువారికి సుపరి చితమైన 'ఇంతింతై వటుడింతయై మఱియు దానింతై నభోవీథిపై..' అనే శ్రీ భక్త పోతనామాత్యుల విరచి తమైన భాగవతంలో కూడా శ్రీవామన విజయం రమ్యం గా వర్ణితమైంది. శ్రీవామన చరితం గురించి ప్రామా ణికంగా తెలుసుకోవాలంటే శ్రీవ్యాసదేవ విరచితమైన శ్రీమద్భాగవతంలోకి వెళ్లాల్సిందే. అందులో శ్రీవామనదేవుని ప్రస్తావన మొదటి స్కంధంలోను, దశమ స్కంధంలోను కొద్దిగా వచ్చినా, 8వ స్కంధంలో విస్తారంగా వర్ణితమైంది. వేదవిభజన, పురాణాలు, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు, మహాభారతం చివరగా శ్రీమద్భాగవతాన్ని అందించిన శ్రీవ్యాసదేవుడు పూర్ణసం తుష్టిని పొందినట్లు భాగవతంలో స్పష్టంగా ఉంది. ఇందులోని మొదటి అధ్యాయంలో భగవంతుని అవతా రాలలో భాగంగా శ్రీవామనావతారం 'పదిహేనవది.'.


పంచదశం వామనకం కృత్వాగాదధ్వరం బలేః
పదత్రయం యాచమానః ప్రత్యాదిత్సు స్త్రిపిష్టపమ్

'పదిహేనవ అవతారంలో భగవానుడు వామనదేవుని రూపాన్ని స్వీకరించి బలి మహారాజు ఏర్పాటు చేసిన యజ్ఞస్థలిని సందర్శించాడు. త్రిభువన రాజ్యాన్ని తిరిగి పొందాలని హృదయంలో తలచినప్పటికీ ఆ దేవదేవుడు కేవలం మూడు అడుగుల నేలను మాత్రమే దానంగా పొందాడు'.


**మూడుసార్లు పుత్రునిగా భగవంతుడు:**

ద్వాపర యుగాంతంలో శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులకు అష్టమ సంతానంగా మధురలోని కారాగారంలో జన్మిం చాడు. అప్పుడు సాక్షాత్తుగా చతుర్భుజాలు, శంఖచక్రగ దాపద్మాలు, వనమాల, కిరీట కుండలాలు, పీతాంబరా లతో వారికి దర్శనమిచ్చాడు. "మీరు స్వాయంభువ మన్వంతరంలో పృశ్నిసుతవులుగా జన్మించారు. ప్రజాసృష్టి చేయమని బ్రహ్మదేవుడు ఆజ్ఞాపించినప్పుడు మీరిద్దరు ఎంతో ఇంద్రియ నిగ్రహంతో తీవ్ర తపస్సు చేశారు. 12,000 దేవతా సంవత్సరాలు తపస్సు చేశాక మీకు నేను దర్శనమిచ్చాను. 'నావంటి పుత్రుని పొందాలని' వరం కోరారు. ఫలితంగానే పృశ్నగర్భంలో నేను అవతరించాను. మీరు తర్వాతి యుగంలో 'అదితి కశ్యపులు'గా జన్మించారు. అప్పుడు మళ్లీ నేను మీకు 'వామనదేవుని'గా ఆవిర్భవించాను. ఉపేంద్రుడిగా ప్రసిద్ధి చెందాను. ఇక, ఇప్పుడు ద్వాపరయుగంలో 'దేవకీ దేవులు'గా జన్మించిన మీకు మూడవసారి పుత్రుని అయ్యాను. నా మాటలు సత్యం. మీ పూర్వజన్మలను గుర్తు చేయడాకే ఈ విష్ణురూపంలో మీ ముందు కు వచ్చాను' అని భగవంతుడు వారితో అన్నాడు. శ్రీమద్భా గవతంలోని దశమ స్కంధంలో శ్రీకృష్ణుని ఆవిర్భావ వేళ ఈ విషయం వెల్లడైంది. పృశ్ని-సుతవులనే దంపతులకు భగవంతుడు మూడుసార్లు పుత్రుడుగా లభించాడు. వారిలో ఒకరే శ్రీవామనదేవుడు.

(మిగతా రేపటి సంచికలో)





గుండ్రమైననొక్క గుమ్మడిపండున,
మస్తకమునునుంచి, మధ్య నట్టి
ఆకృతియునుదాల్చి, యందమ్ము
తోడు గాన్!
తెలిసిమెలగు
మయ్య! తెలుగు
వాడ!



– మల్లాది సోమేశ్వర శర్మ, 9603995769





## రాత్రులు వేడినీటితో స్నానం చేయడం వల్ల ఎన్ని ప్రయోజనాలో తెలుసా?



ఈ రోజుల్లో చాలామంది ఉదయం పూట స్నానం చేసి రాత్రులు స్నానం చేయకుండానే పడుకుంటున్నారు. కొంతమంది మాత్రం అలసిపోవడం వల్ల స్నానం చేస్తే రిలాక్స్ అవ్వొచ్చని స్నానం చేస్తున్నారు. కానీ అప్పుడు తేడా తెలుస్తుంది స్నానం చేసినవారికి చేయనివారికి. స్నానం చేసిన వారు తొందరగా నిద్రలోకి జారుకుంటారు. చేయని వారు అటూ ఇటూ మసులుతుంటారు. అంతేకాదు ఆ స్నానమేదో గోరువెచ్చని నీటితో చేస్తే మరిన్ని ప్రయోజనాలున్నాయింటున్నారు నిపుణులు. మరి అవేంటో తెలుసుకుందాం.రాత్రివేళలో ఉష్ణోగ్రతలు పడిపతాయి. వాతావరణం చల్లగా మారుతుంది. అదే గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. ఇలా చేయడం వల్ల మెలటోనిన్ అనే స్లీపింగ్ హార్మోన్‌ను ప్రేరేపించి గాఢ నిద్ర వచ్చేలా చేస్తుంది.గోరవెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల శరీర కండరాలు విశ్రాంతి తీసుకుంటాయి. టైప్ 2 డయాబెటిస్ సమస్యతో బాధపడేవారు రాత్రి సమయంలో గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే ఫలితం ఉంటుంది.రక్తపోటును తగ్గించుకోవాలంటే రాత్రిపూట గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి.గుండె సమస్యలతో బాధపడేవారు ముఖ్యంగా వేడి నీటితోనే స్నానం చేయాలంటున్నారు. వేడి నీరు మంచిది కదా అని మరీ వళ్లు కాలేంతలా పోసుకోకూడదు. గోరువెచ్చగా ఉంటే సరిపోతుంది.

# బిగువైన అందాలతో పిచ్చెక్కిస్తున్న దళపతి భామ..!!




మలయాళ కుట్టి మాళవిక మోహనన్.. ప్రస్తుతం సోషల్ మీడియాలో రోజు వైరల్ అవుతున్న పేరు. ఈ భామ ఒకటి రెండు హిందీ తమిళ సినిమాలు చేసినా రావాల్సినంత గుర్తింపు రాలేదు. కానీ ఇళయదళపతి విజయ్ మాస్టర్ సినిమాలోని అమ్మడి పోస్టర్ రిలీజ్ చేసేసరికి ఒక్కసారిగా హాట్ టాపిక్ అయింది. అదీగాక ఇళయదళపతి విజయ్ విజయ్ సేతుపతి లాంటి సూపర్ స్టార్లతో లీడింగ్ రోల్ చేయడమంటే మాములు విషయం కాదు. త్వరలోనే మాళవికకు మంచి రోజులు రాబోతున్నాయంటే అతిశయోక్తి కాదు. మాళవిక పేరు మొన్నటి వరకు సినిమా సౌత్ సినీ ఇండస్ట్రీలకు పెద్దగా పరిచయం లేదు. కానీ ఈ బ్యూటీ గురించి ఒక్కసారిగా సోషల్ మీడియాలో చర్చ మొదలైందంటే మాళవిక మ్యాటర్ ఎంత ఇంపార్టెంటో అన్పిస్తుంది కదా.. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేయూ మోహనన్ కూతురే ఈ మాళవిక మోహనన్. అలాంటిది ఇళయదళపతి విజయ్ నటిస్తున్న "మాస్టర్" సినిమా కారణంగా ఒక్కసారిగా వైరల్ అయింది. ఈ భామకు సోషల్ మీడియాలో విపరీతంగా క్రేజ్ సంపాదించుకుంది. అదికూడా తన అందాల ఆరబోత వలనే ఇంతటి క్రేజ్ దక్కించుకుంది. ప్రస్తుతం ఈ భామకు తెలుగులో ఛాన్సులు రానప్పటికీ మాస్టర్ తర్వాత ఖచ్చితంగా వస్తాయని గంపెడు ఆశలతో ఉంది. ఇప్పుడైతే సోషల్ మీడియాలో క్లీవేజ్ షోతో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తుంది. తాజాగా ఈ భామ తన ఇన్స్టాగ్రామ్ ద్వారా ఫోటో పోస్ట్ చేసింది. ఆ ఫోటోలో వి కర్వ్ డ్రెస్ ధరించి ఎద సంపద మొత్తం ప్రదర్శినగా నిలిపింది. అలా రెండు చేతులు నాజూకు నడుముకు ఆనించి చూపిస్తున్న అందాలు చూస్తూ అభిమానులు పిచ్చెక్కిపోతున్నారు. మాళవిక నిలుచున్న పోజు.. మొహంలో మత్తెక్కించే ఎక్స్ ప్రెషన్.. బిగువైన సోయగాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పిక్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# సొగసులో ముద్దుగుమ్మేనట



టాలీవుడ్ యువ హీరోయిన్ ప్రియ వడ్లమాని తెలుగు ప్రేక్షకులకు ఇప్పుడిప్పుడే పరిచయం అవుతోంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్ పూర్ లో పుట్టిన ఈ భామ.. బేసిగ్గా తెలుగు కుటుంబానికి చెందింది. ఇక హైదరాబాద్ లోనే పెరిగిందట. ప్రాథమిక విద్యను హైదరాబాద్ లోనే పూర్తిచేసి బెంగళూరులో ఉన్నత విద్యను పూర్తి చేసిందట. ఇక మొదటి నుండి అమ్మడికి సినిమా రంగం పై ఇంటరెస్ట్ ఉండి మోడలింగ్ లోకి ప్రవేశించింది. అలా 2016లో ఫెమినా మిస్ ఇండియా హైదరాబాద్ పోటీలలో పాల్గొంది. ఎందరో స్టార్ హీరోయిన్లుగా సినీ ఇండస్ట్రీలో ఎదుగుదాం అనుకుంటున్న అమ్మాయిలలో ప్రియా ఒకరు. నిజానికి తెలుగు ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిలే కరువు. ఎక్కడెక్కడి నుండో హీరోయిన్లను తీసుకొచ్చి సినిమాలు తీస్తుంటారు కానీ ఇక్కడే ఉన్న తెలుగు అందాలను మాత్రం ఎవరు పట్టించుకోవట్లేదు. కానీ ఇండస్ట్రీలో యాక్ట్రెస్ అయిపోవాలనే ఆశతో ప్రియ వడ్లమాని మొదటగా సహాయ దర్శకురాలిగా పనిచేసిందట. ఆ తర్వాత 2018లో 'ప్రేమకు రెయిన్ చెక్' అనే సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోయినుగా అడుగు పెట్టింది. ఇక అదే ఏడాది అమ్మడికి వరుస అవకాశాలు తలుపు తట్టాయి. వరుసగా శు భలేఖలు హుషారు సినిమాలు చేసింది. ఇక హుషారు సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ అయిన సంగతి తెలిసిందే. అమ్మడు సినిమా కోసం ఎంత రిస్క్ అయినా చేయడానికి సిద్ధంగా ఉందట. అలాగే గ్లామర్ పరంగా స్కిన్ షో పరంగా అయితే ఎలాంటి హద్దులు లేనట్లే అనిపిస్తుంది. హుషారు సినిమాలో ప్రియా రొమాంటిక్ సన్నివేశాలలో కూడా మెప్పించింది. నిజానికి ఆ సినిమాలో ప్రియ గ్లామర్ కాస్త యువతకు కనెక్ట్ అయింది అనుకోండి. ఆ తర్వాత ఆవిరి సినిమాలో చివరగా కనిపించింది ప్రియా. మరి మళ్లీ ఇంతవరకు ఆమె నుండి ఏ సినిమా రాలేదు. ఇక సోషల్ మీడియాలో ప్రియాకు ఫాలోయింగ్ బాగానే ఉంది. ఇన్స్టాగ్రామ్ లో వరుసగా తన గ్లామర్ ఫోటోలు పోస్ట్ చేస్తూ కుర్రకారును లైన్లో పెడుతోంది. తెలుగు భామే.. కానీ సొగసులో ముద్దుగుమ్మే అంటున్నారు నెటిజన్లు. చూడాలి మరి త్వరలో ఏదైనా సినిమాలో మెరుస్తుందేమో..!!

# 'జాంబీ రెడ్డి'లో తేజ సజ్జా ఫస్ట్ లుక్ విడుదల



డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మూడో చిత్రం 'జాంబీ రెడ్డి'లో హీరోగా ఎవరు నటిస్తున్నారనే సస్పెన్స్‌కు తెరదించుతూ ఆదివారం 10 గంటలకు ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్‌లను చిత్ర బృందం విడుదల చేసింది. 'ఇంద్ర' చిత్రంలో చిన్నప్పటి చిరంజీవిగా నటించడంతో పాటు పలు చిత్రాల్లో బాల నటుడిగా నటించి అందరి ప్రశంసలూ పొంది, సమంత నాయికగా నటించిన 'ఓ బేబీ'లో ఓ కీలక పాత్రలో ఆకట్టుకున్న తేజ సజ్జా 'జాంబీ రెడ్డి'తో హీరోగా పరిచయమవుతున్నాడు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో తేజ గద పట్టుకొని ఉండగా, జాంబీలు అతనిపై ఎటాక్ చేయబోతు న్నట్లు కనిపిస్తోంది. మోషన్ పోస్టర్ విషయానికి వస్తే, వెనకవైపు మెగాస్టార్ చిరంజీవి బొమ్మ ఉన్న షర్ట్ ధరించి స్టైల్‌గా ఇంట్రడ్యూస్ అయ్యాడు తేజ. అతను మ్యాచో లుక్‌లో కనిపిస్తున్నాడు. మోషన్ పోస్టర్ బీజీఎంగా చిరంజీవి సూపర్ హిట్ ఫిల్మ్ 'దొంగ'లోని పాపులర్ సాంగ్ 'కాష్మోరా కౌగిలిస్తే ఏం చేస్తావో' మ్యూజిక్‌ను ఉపయోగించారు. తేజ బర్త్‌డేని పురస్కరించుకొని ఆగస్ట్ 23న విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్ ఇంప్రెసివ్‌గా కనిపిస్తున్నాయి. టాలీవుడ్‌కు జాంబీ కాన్సెప్ట్‌ను పరిచయం చేస్తూ మరో హై-కాన్సెప్ట్ ఫిల్మ్‌తో డైరెక్టర్ ప్రశాంత్ వర్మ మన ముందుకు వస్తున్నారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో వస్తున్న తొలి చిత్రం 'జాంబీ రెడ్డి' కావడం గమనార్హం.


# పెళ్ళిపీటలెక్కబోతున్న మెగాహీరో..



లాక్ డౌన్ టైమ్ లో టాలీవుడ్ హీరోలు ఒక్కొక్కరుగా పెళ్ళి పీటలెక్కుతున్నారు. టాలీవుడ్ మోస్ట్ ఎలిజబుల్ బ్యాచలర్స్ అందరూ ఓ ఇంటి వారవుతున్నారు. నితిన్, నిఖిల్, రానా.. ఇలా ఒక్కొక్కరుగా పెళ్ళి బాట పడుతున్నారు. తాజాగా మరో టాలీవుడ్ హీరో పెళ్ళి పీటలెక్కబోతున్నాడు. మెగాహీరో సాయి ధరమ్ తేజ్ పెళ్ళి చేసుకుని ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఈ విషయమై సాయి ధరమ్ తేజ్ ట్విట్టర్ వేదికగా హింట్ ఇచ్చాడు. సాయి ధరమ్ తేజ్ ట్విట్టర్ లో పోస్ట్ చేస్తూ, మనం ఒక్కోసారి ఎన్నో అనుకుంటాం..కానీ ఆ టైమ్ వచ్చినపుడు మరి అంటూ అప్పట్లో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అయిన వాట్సాప్ వీడియోని పోస్ట్ చేసాడు. సింగిల్ ఆర్మీ పేరుతో క్రియేట్ చేసిన వాట్సాప్ గ్రూప్ లో నిఖిల్, రానా ఒక్కొక్కరుగా బయటకి వెళ్ళిపోతున్నారు. చివరికి సాయి ధరమ్ తేజ్ రిప్లై ఇస్తూ సారీ ప్రభాస్ అన్నా అని మెసేజ్ ఉంది. మిగతా విషయాలని రేపు ఉదయం 10గంటలకి వెల్లడి చేస్తాడట. మొత్తానికి లాక్ డౌన్ టైమ్ లో సాయి ధరమ్ తేజ్ తన జీవితంలోకి భాగస్వామిని ఆహ్వానిస్తున్నాడన్నమాట.

# 'కళాపోషకులు' చిత్ర మోషన్ పోస్టర్ విడుదల

శ్రీ వెన్నెల క్రియేషన్స్ బ్యానర్ పై విశ్వకార్తికేయ, దీప ఉమావతి హీరో హీరోయిన్స్ గా తెరకెక్కబోతున్న సినిమా కళాపోషకులు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. లవ్ స్టోరీతో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉండబోతున్నాయి. ఆ నలుగురు చిత్రంలో చైల్డ్ ఆర్టిస్ట్ గా నటించిన విశ్వకార్తికేయ ఈ సినిమాతో హీరోగా పరిచయం అవ్వడం విశేషం. ఈ సందర్భంగా నిర్మాత ఏమ్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 'కళాపోషకులు' చిత్రాన్ని దర్శకుడు చలపతి పువ్వల బాగా తెరకెక్కించాడు. మహావీర్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు అలరించే విధంగా ఉండబోతొంది. నటీనటులు అందరూ బాగా చేశారు. త్వరలో ఈ సినిమాకు సంభందించిన మరిన్ని విషయాలు తెలియజేస్తాము.. అన్నారు. డైరెక్టర్ చలపతి పువ్వల మాట్లాడుతూ.. నిర్మాత సుధాకర్ రెడ్డిగారు ఎక్కడా రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. హీరో విశ్వ కార్తికేయ బాగా చేశాడు, సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా ఉంటుంది. కల్యాణ్ సమి కెమెరా వర్క్, ఎలెందర్ మహావీర్ మ్యూజిక్ సినిమాకు అదనపు ఆకర్షణ కానున్నాయని తెలిపారు.




# పూజా తోనే స్టార్ట్ చేస్తారట..



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం జిల్ ఫేమ్ రాధాకృష్ణ డైరెక్షన్లో రాధే శ్యామ్ మూవీ చేస్తున్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియా మూవీ గా తెరకెక్కుతున్న ఈ మూవీని గోపి కృష్ణ మూవీస్, యూవీ క్రియేషన్స్ లు సంయుక్తంగా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ మధ్యనే రిలీజ్ చేసి అబిమానుల్లో ఆనందం నింపారు. ప్రస్తుతం కరోనా వైరస్ కారణంగా ఆగిపోయిన షూటింగ్ ను త్వరలోనే మొదలుపెట్టాలని చూస్తున్నారు. లాక్ డౌన్ కి ముందు జార్జియాలో చిత్రీకరణ జరుపుతున్న టీమ్ కరోనా కారణంగా కొంత షూట్ మిగిలి ఉండగానే ఇండియాకు తిరిగివచ్చేశారు. మిగిలిన బ్యాలెన్స్ పార్ట్ షూట్ ను రామోజీ ఫిల్మ్ సిటీలో తీయనున్నారు. ఈ షూటింగ్ లో ముందుగా పూజా హగ్దే పై కొన్ని సీన్లు చేయనున్నారట. పీరియాడిక్ మూవీ కావడంతో పూజా గెటప్ కూడా ఆనాటి ట్రెడిషనల్ క్లాసిక్ డాన్సర్ ను పోలి ఉంటుందని ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

# ఇంతలా తెరిచి పెడితే ఎలా అమ్మడు!!..

కోలీవుడ్ ప్రేక్షకులకు సాక్షి అగర్వాల్, ఆమె అందచందాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. బిగ్ బాస్ తమిళ్ మూడో సీజన్‌లో పాల్గొని ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. లాస్లియ, సాక్షి, కొట్లాట, కెవిన్ ట్రయాంగిల్ లవ్ స్టోరీ ఇలా ప్రతీ విషయంలో సాక్షి హైలెట్ అయింది. బిగ్ బాస్ హౌస్‌లో గ్లామర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన సాక్షి మధ్యలో ఆటలోంచి బయటకు వచ్చేసింది. బయటకు వచ్చాక సాక్షి రెట్టింపు వేగంతో దూసుకుపోయింది. బిగ్ బాస్ కంటే ముందు సాక్షి చాలానే చిత్రాలు చేసింది. సూపర్ స్టార్ రజినీ కాలా సినిమాలోనూ నటించింది. అయితే సినిమాల కంటే బిగ్ బాస్ షోనే సాక్షికి ఎక్కువగా ఫాలోయింగ్‌ను తీసుకొచ్చింది. అందుకే షో నుంచి బయటకు వచ్చాక సాక్షి సోషల్ మీడియాలో బిజీ అయింది. నిత్యం వ్యాయామం అంటూ ఫిట్‌నెస్ గురించి ఎన్నో సూచనలు ఇస్తూ ఉంటుంది.



చిన్నప్పుడు తన గురించి, తన ఆహార్యం గురించి ఎంతమంది ఎన్ని రకాలుగా కామెంట్ చేసేవారో ఆ మధ్య చెప్పుకొచ్చింది సాక్షి. చిన్నతనంలో అందవికారంగా ఉందని తోటీ స్నేహితులు ఎంతోహేళన చేసేవారట. మొద్దుగా ఉంది, చబ్బీగా ఉంది, లావు అంటూ ఏవేవో కొత్త పేర్లు పెట్టి పిలిచే వారని తెలిసిందే. అయితే వారిని తాను ఏమీ అనదల్చుకోలేదని, ఎందుకంటే వారు అలా అనడం వల్లే తాను ఈ రోజు ఈస్థాయిలో ఉన్నానని చెప్పుకొచ్చింది.

# స్విమ్ సూట్ జిప్ నిలవనంటోంది!

బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ.. ఇషా గుప్తా పరిచయం అవసరం లేదు. ఈ మాజీ మిస్ హాట్ నెస్ కి కవ్వింతకు కేరాఫ్ అడ్రెస్. ఫెమీనా మిస్ ఇండియా దివా పోటీలకు జడ్జిగా .. మోడల్స్ శిక్షకురాలిగా సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ ఈ భామ. ఇషా గుప్తా స్టైల్ అండ్ ఫ్యాషన్ ఐకన్‌గా దశాబ్ధాల పాటు పాపులారిటీని కొనసాగిస్తున్నారు. ఇక ఎందరో అందాల రాణుల్ని తయారు చేసే ఇనిస్టిట్యూషన్స్ లో తానో స్పెషలిస్ట్ లెక్చరర్.పబ్లిసిటీని పరాకాష్ఠకు తీసుకెళ్లడంలో ఇషా గుప్తాని కొట్టేవాళ్లే లేరంటే నమ్మగలరా? తన ఇషా ఇన్ స్టా ఫోటోలకు ఉండే ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. రెగ్యులర్ గా తనని అనుసరించే వారి సంఖ్య లక్షల్లో ఉంది. గత కొంతకాలంగా క్వారంటైన్ టైమ్ ని ఇషా ఇదిగో ఇలా లేటెస్ట్ ఫోటోషూట్లతోనే స్పెండ్ చేస్తున్నారు. తాజా ఫోటోలో స్విమ్ వేర్ లో కనిపించింది. ఇక ఇషా ధరించిన ఆ స్విమ్ సూట్ కి జిప్ నిలవనంటోంది. జన్నత్ 2 చిత్రంతో బాలీవుడ్ లో అడుగు పెట్టిన్న ఇషా



తొలి ప్రయత్నం ఇమ్రాన్ హష్మి సరసన నాయికగా నటించింది. ఆ తర్వాత వేడెక్కించే సన్నివేశాల్లో ఎలాంటి మొహమాటం లేని నాయికగా పాపులరైంది. కమెండో 2 సహా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం హేరాఫేరి 3లోనూ నాయికగా నటిస్తోంది. అలాగే దేశీ మ్యాజిక్‌అనే చిత్రంలోనూ నటిస్తోంది. ఇక పలు టీవీ చానెళ్లలో ఫ్యాషన్ డ్యాన్స్ రియాలిటీ షోలకు జడ్జిగానూ కొనసాగుతూ బిజీగా ఉంది.

# తిరుపతి, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు వార్తలు



తిరుపతి, వార్తావళి, ఆగస్ట్ 24: ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్‌సోర్సింగ్ సర్వీసెస్‌లో కలపరాదని డిమాండ్ చేస్తూ టిటిడి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రోజుకో రీతిలో వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. టిటిడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం వద్ద చేపట్టిన నిరసన దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. టిటిడి ఎంప్లాయిస్ బ్యాంకు డైరెక్టర్లు, నాయకులు దీక్షా శిబిరానికి చేరుకుని మద్దతు తెలియజేశారు. టిటిడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఎం.నాగార్జున మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాలో కలిపేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తోందని, దీనివల్ల కలిగే లాభం ఏంటని

## ఒంటికాలిపై నిలబడి నిరసన

**8వ రోజుకు చేరిన టిటిడి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన దీక్ష**

ప్రశ్నించారు. కరోనా విపత్తు సమయంలో మూడు నెలలుగా సిబ్బంది పలు రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. విలీనం వల్ల టీటీడీకి సెస్ రూపంలో సంవత్సరానికి సుమారు మూడు కోట్ల రూపాయలు నష్టం కలుగుతున్నా టిటిడి అధికారులు పట్టించుకోకుండా ఈ నిర్ణయానికి వత్తాసు పలకడం శోచనీయమన్నారు. ఇకనైనా యాజమాన్యం స్పందించి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విలీన ప్రక్రియను నిలుపుదల చేయాలని, ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి గత పాదయాత్ర, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన టైమ్ స్కేలు హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. టిటిడి ఎంప్లాయిస్ బ్యాంకు డైరెక్టర్, టిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు జి.వెంకటేశం మాట్లాడుతూ మూడు నెలలుగా అవుట్‌సోర్సింగ్ సొసైటీల కార్మికులు పోరాటం చేస్తుంటే పాలక మండలి మరియు అధికారులు పట్టించుకోకపోవడం చాలా శోచనీయమన్నారు. సీఎం గారు అర్హత కలిగిన వారికి మూడు నెలల్లోనే టైం స్కేల్ ఇస్తానని చెప్పి, ఇప్పుడు ఆప్కాస్ లో విలీనం చేయడం దుర్మార్గమని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో టిటిడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, కోశాధికారి నవీన్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జి.హరికృష్ణ, నాయకులు నిరంజన్ పాల్గొన్నారు.

## ప్రతి ఆసుపత్రికి ఒక నోడల్ అధికారిని నియమించాలి



చిత్తూరు, వార్తావళి, ఆగస్ట్ 24: రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కోవిడ్ చికిత్సలు అందిస్తున్న ప్రతి ఆసుపత్రికి ఒక నోడల్ అధికారిని నియమించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ కమిషనర్ కె. భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా సచివాలయంలో వెలగపూడి నుండి ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ కమిషనర్ కరోనా వైరస్ నివారణ చర్యలలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివిధ జిల్లాలలోని జిల్లా జాయింట్ కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, డి.సి.హెచ్.ఎస్.లు, ఆసుపత్రుల సూపరిండెంట్ లు, పి.హెచ్.సి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలి వెల్ఫేర్ కమిషనర్ మాట్లాడుతూ కోవిడ్ ఆసుపత్రుల నోడల్ అధికారులు ప్రతి రెండు గంటలకు ఒకసారి కోవిడ్ ఆసుపత్రుల యొక్క సమాచారంను సేకరించి అక్కడ అందుబాటులో ఉన్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది,మాస్కులు, పి.పి.ఈ కిట్స్ యొక్క సమాచారాన్ని ఆసుపత్రుల సూపరిండెంట్ ల ద్వారా సేకరించి జిల్లా కాల్ సెంటర్లకు పంపాలన్నారు. కోవిడ్ ఆసుపత్రుల యందు అందుబాటులో ఉన్న పడకల వివరములను మ్యాపింగ్ చేయాలని తెలిపారు. కోవిడ్ చికిత్సలు అందిస్తున్న ఆసుపత్రుల సూపరిండెంట్ ల ద్వారా ప్రతి రోజు ఎంత మంది రొగులు చేరారు, ఎంతమంది డిశ్చార్జ్ అయ్యారు, ఎంత మంది చనిపోయారు అన్న వివరాలతో పాటు అందుబాటులో ఉన్న రూములు, సాధారణ పడకలు,ఆక్సిజన్ పడకలు,ఐ.సి.యూ సెటప్ తో కూడిన పడకలు ఎన్ని అందుబాటులో ఉన్నాయనే వివరములను ప్రతి రోజు మ్యాపింగ్ చేసి రియల్ టైమ్ మేనేజ్మెంట్ లాగిన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. ఐ.సి.ఎం.ఆర్ ఫార్మెట్ లో రూపొందించబడిన శ్యాంపుల్ టెస్ట్ లు మరియు ల్యాబ్ ద్వారా వచ్చే శ్యాంపుల్ టెస్ట్ ల ఫలితాలు సమానంగా ఉండాలని ఎక్కడైనా వ్యత్యాసం ఉన్నచో ఈ నెల 25 వ తేదీ లోగా సవరించి శ్యాంపుల్ తీసిన ప్రతి ఒక్కరికి ఫలితాలను అందజేయాలన్నారు. హెూం ఇసోలేషన్ మరియు స్వీయ నిర్బంధంలో ఉన్న వ్యక్తులను మ్యాపింగ్ చేసి అందుకు ఆశాలు, ఏ.ఎన్.ఏం లను భాద్యులను చేసి వీరు ప్రతి రోజు వారి ఇంటి వద్దకు వెళ్ళి సందర్శించి వైద్య సేవలు అందించాలన్నారు. హెూం ఇసోలేషన్ లో ఉన్న వ్యక్తులను సంబందిత వైద్యాధికారులు వారి ఇంటి వద్దకు వెళ్ళి సందర్శించి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించాలని పల్స్ ఆక్సీమీటర్ ద్వారా ఆక్సిజన్ లెవల్స్ చూడాలని తెలిపారు. కోవిడ్ చికిత్సలు అందిస్తున్న కోవిడ్ కేర్ కేంద్రాలయందలి కరోనా రోగులకు ప్రతిరోజూ సాధారణ పరీక్షలు నిర్వహించి వారి యొక్క వివరములను హాస్పిటల్ వైటల్ ఎలిమెంట్స్ యాప్ నందు పొందుపరచాలని చెప్పారు.కోవిడ్ చికిత్సలో అందిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులకు మరియు వై.ఎస్.ఆర్.ఆరోగ్యశ్రీ నెట్-వర్క్ ఆసుపత్రులకు జిల్లా స్థాయి నోడల్ అధికారులను నియమించి వారి ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు తిరుపతి సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి జాయింట్ కలెక్టర్ వీర బ్రహ్మం(అభివృద్ధి), జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పెంచలయ్య, చిత్తూరు నుండి పి.ఓ.డి.టి.టి డాక్టర్ రమాదేవి, డి.ఎస్.ఓ డాక్టర్ సుధర్శన్ పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, వార్తావళి, ఆగస్ట్ 24: ఎట్టకేలకు శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి భక్తుల రద్దీతో కళకళలాడుతుంది. సోమవారం అందులోను శివయ్యకు ప్రీతికరమైన రోజు కావడంతో విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. కరోనా ప్రభావంతో భక్తుల సందడి లేక వెలవెలబోతున్న శ్రీకాళహస్తి ఆలయం ఎట్టకేలకు సోమవారం భక్తుల రద్దీతో కళకళలాడింది.



## నాకు మోటార్ ట్రై సైకిల్ ఇప్పించండి



పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 24: నాకు రెండు కాళ్ళు పూర్తిగా పనిచేయవు, నాకు మోటార్ ట్రై సైకిల్ ఇప్పించండి. అని గుమ్మలక్ష్మీ పురం, లుంబేసు పంచాయతీ గౌడు గూడ గ్రామానికి చెందిన తాడంగి నిర్మల ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి అర్.కూర్మనాథ్ గారికి దరఖాస్తు అందించింది, నేను అన్ని పనులు స్వయంగా చేసుకోగలను నాకు మోటార్ ట్రై సైకిల్ మంజూరు ఇప్పించవలసిందిగా కోరింది, వెంటనే స్పందించిన ప్రాజెక్ట్ అధికారి సంబంధిత అధికారులను దరఖాస్తు పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేంచారు.

## ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ



ఓబులవారిపల్లె, వార్తావళి, ఆగస్ట్ 24: మండలంలోని మండల సమాఖ్యలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సమన్వయకర్త మూరముట్ల శంకరయ్య సమక్షంలో గ్రామసంఘాల అధ్యక్షురాలు కోశాధికారి లకు ఇంచార్జ్ ఏ పి యం గోవిందమ్మ ద్వారా పంపిణీ చేశారు ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ కోవిడ్ -19 వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో సిఎస్ఎ సంస్థ రైతులకు ఉచితంగా విత్తనాలు ఇవ్వడం జరిగింది అన్నారు, ఓబులవారిపల్లి మండలంలో దాదాపు మూడు వేల మందికి నవధాన్యాలు మరియు 18 రకాల కూరగాయల విత్తనాలు, వేప పిండి పంపిణీ చేయడం జరుగుతుందనివీటి ద్వారా ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు ఈ వ్యవసాయం చేయడం వలన రైతులకు పెట్టుబడి తగ్గడ మే కాకుండా అధిక దిగుబడి సాధించడంతోపాటు నేల, నీరు, వాయువులను కలుషితం కాకుండా జీవ వైవిధ్యం ను పెంపొందించడం తోపాటు పర్యావరణాన్ని పరిరక్షించే వచ్చని ఈయన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలసమాఖ్య సిబ్బంది, ఎంసిఎ బుల్లయ్య, పిఆర్‌పి నారాయణస్వామి మరియు మహిళ సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భూముల కేటాయింపుల మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయండి: జిల్లా కలెక్టర్



చిత్తూరు, వార్తావళి, ఆగస్ట్ 24: జిల్లాలో నేషనల్ హైవేకు సంబంధించి తహశీల్దార్లులో వారి పరిధిలో భూముల కేటాయింపులకు సంబంధిం చిన మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.నారాయణ భరత్ గుప్త తహశీల్దార్ల ను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ నేషనల్ హైవే పై తహసిల్దార్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలె క్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి భూముల కేటా యింపు ప్రక్రియలో భాగంగా రైతు భరోసా కేంద్రాలు, హాస్పిటల్స్, గ్రామ సచివాల యాలు, పరిశ్రమలు,రోడ్లకు సంబంధించి ఇదివరకే తహ శీల్దార్లు భూముల కేటాయిం పులు చేయడం జరిగిందని.. కానీ తహశీల్దార్లు మ్యూటే షన్ ప్రక్రియ మాత్రం పెండింగ్‌లో ఉంచడం జరిగిందని వెంటనే తహసీల్దార్లు లంద రూ మ్యూటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఎన్.హెచ్-4 సంబంధించి నంగమంగళం - నంగిలి చెక్ పోస్ట్,ఎన్.హెచ్ 140, కుక్కల పల్లి - మల్లవరం, మదనపల్లి - తిరుపతి,తిరుపతి-వెంకటగిరి లతో పాటు చిత్తూరు మదనపల్లి తిరుపతి డివి జన్ల వారీగా నేషనల్ హైవే సంబంధించి భూ సేకరణ మరియు మ్యూటేషన్,అలీ నేషన్ ప్రక్రియలను పూర్తి చేసేందుకు సబ్ డివిజన్ అధికారులు అయిన మదన పల్లె సబ్ కలెక్టర్,చిత్తూరు, తిరుపతి ఆర్‌డిఓలు కృషి చేయాలన్నారు. ప్రతి పి హెచ్ సి పరిధి లో విలేజ్ వెల్నెస్ సెంటర్ల ఏర్పాటు కు భూమి కేటాయించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జేసి 2 వి.ఆర్.చంద్రమౌళి, ఈ,జి సెక్షన్ పర్యవేక్షకులు మురళి, వెంకటేశ్వర్లు నేషనల్ హైవే కి సంబంధించి అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరసన ప్రదర్శన




గోకవరం, వార్తావళి, ఆగస్ట్ 24: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ మధ్యంతర కౌన్సిల్ తీర్మానం మేరకు సోమ వారం మండల కేంద్రం మైన గోకవరం ఎంపీడీవో ఆఫీస్ వద్ద విద్యారంగ సమస్యలు,ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన కార్యక్రమాన్ని గోకవరం యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చడమైనది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎస్. అనిల్ కుమార్ మాట్లాడుతూ పలు సమస్యలు విలేకర్ల సమావేశంలో తెలియజేశా రు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన జాతీయ విద్యా విధానం 2020 అమలు చేయడం వల్ల భవిష్యత్తు తరాలకు విద్య అందని ద్రాక్షలా మారబోతుంది అని తెలియజేశారు. అదే విధంగా విద్యలో రాష్ట్రాలకు ఉన్న అధికారులు అధికా రాలుకు భంగం కలుగు తుందని తెలిపారు. రాజ్యాంగ లక్ష్యాలతో కూడిన కామన్ విద్యా విధానం అమలు చేయాలని మరియు జాతీయ విద్యా విధానంపై పునః సమీక్షించాలని ఆయన కోరారు. కరో నాతో మూతబడ్డ పాఠశా లలో విద్యార్థులకు ప్రత్యా మ్నాయ మార్గాలతో విద్యను అందించాలని అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మో హన్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు సిపిసి రద్దు చేస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అదేవిధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. 2018 జులై 1 నుండి అమలు చేయవలసిన 11వ పిఆర్సి రిపోర్టును ప్రభుత్వం పరిశీ లించి వెంటనే నూతన వేతనాలు అమలుకు తగిన చర్య తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. నాగభూ షణం, ఎ. గాంధీ పి ఎస్ నెల్సన్, కె. శ్రీనివాస్, హరి, పార్థ, అప్పారావు, సుబ్రహ్మణ్యం మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీసులకు ఆక్సిజన్ సిలిండర్ అందజేత

### విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి



సాలూరు, వార్తావళి, ఆగస్ట్ 21: విజయనగరం జిల్లాలో కోవిడ్ 19 విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ఆక్సిజన్ సిలిండర్ అందజేసేందుకుగాను విజయనగరం తిరుమల నర్సింగ్ హెూం ఎమ్.డి డా॥ తిరుమల ప్రసాద్, జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి, ఐపిఎస్‌నుతే. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కలిసారు. కోవిడ్ 19 వైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న తరుణంలో బయట తిరగడానికే భయపడే పరిస్థితుల్లో పోలీసులు నిర్విరామణంగా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్నారని, వారిలో స్ఫూర్తిని నింపి, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ముందుండి నడిపిస్తున్నారని జిల్లా ఎస్పీ సేవలను డాక్టరు తిరుమల ప్రసాద్ కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే కోవిడ్ 19 విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నామని, తమకు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు మద్దతు తెలిపి, ఎన్నో విధాలుగా సహాయాన్ని అందించేందుకు ముందుకువచ్చారని స్వచ్ఛంద సంస్థల సేవలను జిల్లా ఎస్పీ ప్రశంసించారు. విజయనగరం తిరుమల నర్సింగ్‌హెూం ఎమ్.డి డా॥ తిరుమల ప్రసాద్ ఆక్సిజన్ సిలిండరు జిల్లా ఎస్పీకి అందజేసారు. తాము అందజేసిన ఆక్సిజన్ సిలిండర్‌ను ప్రజల కోసం పని చేస్తున్న పోలీసులకోసం పోలీసు అంబులెన్స్‌లో వినియోగించాల్సిందిగా జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారినికోరారు. ఆక్సిజన్ సిలిండర్ అయిపోయిన వెంటనే సిలిండర్‌ను వెంటనే కొత్త సిలిండర్‌ను సరఫరా చేస్తామని డా॥ తిరుమల ప్రసాద్ అన్నారు. పోలీసుల సేవలను గుర్తించి పోలీసుల ఆరోగ్య పరిరక్షణకుగాను ఆక్సిజన్ సిలిండర్ ఇచ్చినందుకుగాను జిల్లా పోలీసు శాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ వి.వి. అప్పారావు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## తయ్యూబ్ వెల్ఫేర్ సొసైటీ ఆస్తులను పరిరక్షించాలి

**ఉప ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసిన సొసైటీ అధ్యక్షులు సుభాన్ భాష**



కడప, వార్తావళి, ఆగస్ట్ 24: పబ్బాపురం లోని ముస్లింలకు చెందిన తయ్యూబ్ వెల్ఫేర్ సొసైటీ ఆస్తులను పరిరక్షించాలని తయ్యూబ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుభాన్ భాష, సోమవారం ఉప ముఖ్య మంత్రి వర్యుల నివాసంలో ఉప ముఖ్యంత్రి మంత్రివర్యులు ఎస్ బి.అంజాద్బాష కు వినతిపత్రం సమర్పించారు. 1989 సంవత్సరంలో కడప పట్టణానికి చెందిన కొంతమంది ముస్లింలు తయ్యూబ్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేశారన్నారు. సొసైటీలోని సభ్యులు ఇల్లు, అంగళ్లు, మసీదులు, తిరిగి వసూలు చేసిన డబ్బుతో 1996 సంవత్సరంలో కడప నగర ముస్లింల అభివృద్ధికి పబ్బాపురంలో 30 ఎకరాల భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం భూముల విలువ పెరగడంతో కొందరు సొసైటీ లోని వ్యక్తులు 2 గ్రూపులుగా ఏర్పడి 30 కోట్ల విలువ చేసే ఆస్తిని మూడు కోట్ల రూపాయలకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ భూమిలో మసీదు నిర్మాణం, ఈద్గా, యువతకు ఉపయోగపడే స్కిల్ డెవలప్మెంట్ కోర్సులకు ఈ భూమిని ఉపయోగించాలని సుభాన్ భాష, వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి వర్యులు స్పందించి భూమి అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రేక్షకుల ముందుకు అనుష్క నటించిన 'నిశ్శబ్దం' సిద్ధం



సినిమా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధంగా ఉంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా అనుష్క ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను కూడా సినీ పరిశ్రమలో క్యాస్టింగ్ కౌచ్ వల్ల ఇబ్బందులు పడ్డట్లు వెల్లడించింది. సినీ రంగంలో ఇటువంటి వేధింపులు ఎదురవుతాయన్న విషయం అందరికీ తెలిసిందే అని చెప్పుకొచ్చింది. టాలీవుడ్‌లో కూడా క్యాస్టింగ్ కౌచ్ ఉందని కెరియర్ స్టార్టింగ్‌లో తనకి కూడా ఇవి ఎదురయ్యాయని చెప్పింది. అయితే నేను స్ట్రైట్ ఫార్వార్డ్‌గా, ధైర్యంగా ఉండటం వల్ల కాస్టింగ్ కౌచ్ నుంచి తప్పించుకోగలిగానని ఆమె తెలిసింది. ఇక ఇండస్ట్రీకి కొత్తగా వచ్చే వారికి ఇలాంటి సంఘటనలు ఎదురవుతూనే ఉంటాయని చెప్పుకొచ్చింది అనుష్క.

## ఆర్జీవీకి కోర్టు షాక్.. అమృతే గెలిచింది!



నల్గొండ, వార్తావళి, ఆగస్ట్ 24: వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు కోర్టు షాకిచ్చింది. వర్మ రూపొందిస్తున్న 'మర్డర్' సినిమా విడుదలను నిలిపివేయాలంటూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు మధ్యంతర ఉత్వర్వులు ఇచ్చింది. నల్గొండలో జరిగిన ప్రణయ్ హత్య కేసు ఆధారంగా వర్మ 'మర్డర్' సినిమా రూపొం దిస్తున్నట్లు ఆయన ట్విట్టర్ పోస్టులను, సినిమా టీజర్‌ను బట్టి చూస్తే అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రణయ్ భార్య అమృత, తండ్రి బాలస్వామి కోర్టును ఆశ్రయించారు. తమ కుటుంబాన్ని సంప్రదించకుండా వర్మ సినిమా తీస్తున్నారని, తమ కులాన్ని కించపరిచేలా వర్మ సినిమా రూపొందిస్తున్నారని పిటీషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా ఈ సినిమాతో ప్రణయ్ హత్య కేసు తప్పుదారి పడుతుందని అమృత, బాలస్వామి కోర్టుకు విన్నవించుకున్నారు. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు 'మర్డర్' సినిమా విడుదలను నిలిపివేయాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో అమృత తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. అయితే నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్వర్వులపై హైకోర్టుకు వెళతామంటు వర్మ తరపు న్యాయవాది తెలిపారు.

# విశాఖ రూరల్

## స్వాతంత్ర సమరయోధులు పుస్తకం ఆవిష్కరణ



**విజయనగరం, వార్తావళి, ఆగస్ట్ 21:** స్వాతంత్ర సమరయోధుల చరిత్రను నేటి యువతకు తెలియజేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఆయన నివాసంలో సాగి సీతారామరాజు కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నాలుగు ఎస్సుల రాజు ప్రచురించిన స్వాతంత్ర సమరయోధులు పుస్తకాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఎందరో దేశ నాయకులు, దేశభక్తులు తమ జీవితాలను త్యాగం చేసి సాధించారన్న విషయాన్ని నేటి తరం యువత గుర్తుంచుకోవాలని సూచించారు. ఇటువంటి పుస్తకాలు యువత ను దేశ భక్తి కలిగిన వారిగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డోల మన్మధ కుమార్, గురుస్వామి కందాళ సాయిబాబా, పుస్తక ప్రచురణ కర్త నాలుగెస్సుల రాజు పాల్గొన్నారు.

## సి.పి.ఎస్ ను రద్దు చేయాలి

### - రావులపాలెం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నిరసన



**రావులపాలెం, వార్తావళి, ఆగస్ట్ 21:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్ జ్యోతి బసు డిమాండ్ చేశారు. సోమ వారం యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఆయన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లా డుతూ, 11వ, పిఆర్‌సిని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 4 డిఎలను వెంటనే విడుదల చేయాలని, మార్చి, ఏప్రియల్ నెలల్లో ఇవ్వాల్సిన 50 శాతం జీతాల బకాయిలు వెంటనే విడుదల చేయా లని డిమాండ్ చేశారు. అలాగే విద్యాసంవత్సరం వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో మండల యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు పి.నిర్మళ కుమారి,కృష్ణ మూర్తి,బి శ్రీనివాస్, కె శ్రీనివాస్, వి.విజయ భాష్కర్,సిహెచ్ శ్రీనివాసరావు, కెఎల్ నాగేశ్వరరావు,ఎమ్ పైడి రాజు,పివివి సుబ్బరాజు,పి సురేష్ లు పాల్గొన్నారు.

## ఎర్రగట్టు గ్రామంలో సీపీఎం బృందం పర్యటన

**ఎటపాక, వార్తావళి, ఆగస్ట్ 21:** వరద ముంపు గ్రామమైన ఎర్రగట్టు గ్రామంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు , వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా జనరల్ సెక్రటరీ బి వెంకట్‌లు పర్యటించారు. ముందుగా గ్రామంలోని ముంపుకు గురైన ఇండ్లను , నీట మునిగిన మిరప నారుమడులను , పత్తి, వరి చేలను పరిశీలించారు . అనంతరం గ్రామంలో స్కూల్ భవనం లో ఉన్న సహాయ శిబిరంలో వరద బాధితులతో మాట్లాడారు. ఈ సంద ర్భంగా వరద బాధితులు మాట్లాడుతూ గత ఆరు రోజులుగా 48 ఇళ్లు నీట మునగగా పాఠశాల భవనంలో తలదాచుకున్నామని అన్నారు. వరద ముంపుకు గురై వారం రోజులు అవుతున్నా ఈ గిరిజన గ్రామాన్ని ఏ ఒక్క అధికారి గానీ పరిశీలించలేదని తెలిపారు. వారం రోజులు చీకటిలో బిక్కుబిక్కుమంటూ గడపామని వాపోయారు.రేషన్ బియ్యం ఇవ్వలేదని, కొవ్వొత్తులు ఇవ్వలేదని తెలిపారు. గతంలో ఐటీడీఏ పీవో చింతూరు లో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడి ఎర్రగట్టు గ్రామం వరద ముంపుకు గురి కాదని తేల్చి చెప్పారని కానీ ఈరోజు సుమారు 48ఇళు వరద ముంపుకు గురయ్యాయని తెలిపారు. గ్రామం చుట్టూ ఉన్న పంట పొలాలు, నారుమళ్లు ముంపుకు గురై తీవ్రంగా నష్టపోయామని తెలిపారు. అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ముంపుకు గురై వారం రోజులు అవుతున్న అధికారులు పట్టించుకోక పోవడం చాలా దుర్మార్గమన్నారు. ఆదివాసీలకు వరద ముంపు సమాచారం ముందుగా తెలియజేసి వారందర్నీ సురక్షిత ప్రాంతాలకు చేర్చి వారికి సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించింది అన్నారు. ఇంతటి నిర్లక్ష్యమైన పాలన గతంలో ఎన్నడూ లేదన్నారు. ఈ నాలుగు మండలాల్లో వందలాది గ్రామాలు నీట మునిగాయని వారందరికీ ప్రభుత్వం తక్షణమే సహాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసిత కాలనీ లు కూడా వరద చుట్టూ ఉండే ప్రాంతంలోనే కడుతున్నారని అన్నారు. ఇలాంటి వరదలు వస్తే వారందరికీ కూడా మళ్లీ సహాయక శిబిరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. ప్రభుత్వం ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని పోలవరం నిర్వాసితులకు మెరుగైన చోటు పునరావాసం కల్పించాలని సీపీఎం కోరుతుంది అన్నారు. గత సంవత్సరం ముంపుకు గురైన పంటలకు నష్ట పరిహారంపై ప్రభుత్వం నేటికి స్పందించడం లేదన్నారు .అసలు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఇక్కడి పరిస్థితులన్నీ రాష్ట్ర కమిటీ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సున్నం రాజయ్య లాంటి నాయకులు ఉంటే ఇప్పుడు ఇక్కడ పరిస్థితి వేరేలా ఉండేది అన్నారు. ఏదేమైనా సిపిఎం పార్టీ ప్రజాసమస్యలను పై పోరాడుతుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆలిండియా సెక్రటరీ బి. వెంకట్ మాట్లాడుతూ సహాయ చర్యలు చేపట్టడంలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినదని విమర్శించారు.

## రాంబిల్లి మండలంలో అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలి

**అనకాపల్లి, వార్తావళి, ఆగస్ట్ 21:** ఎలమంచిలి నియోజకవర్గం ,రాంబిల్లి మండలం ,పంచదార్ల గ్రామంలో, అక్రమ మైనింగ్ జరుగుతుందీ అని పంచదార్ల గ్రామానికి చెందిన కొంతమంది యువజన నాయకులు ప్రజా సంఘాల నాయకుల దృష్టికి తీసుకురాగా, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆర్టిఓ ఆఫీస్ అధికారి సూపరిండెంట్ శర్మ గారిని కలిసి,రాంబిల్లి మండలం లో పంచదార్ల గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని , సుమారు 20 ఎకరాల భూమి లొ అక్రమ మైనింగ్ చేస్తూ, వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న, అక్రమ మైనింగ్ కు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అనుమతులకు మించి లోతుగా అక్రమ మైనింగ్ జరుగుతుండడం వలన కనీసం చుట్టుపక్కల హెచ్చరిక బోర్డులు కూడా పెట్టకపోవడం వలన , స్థానికులకు చెందిన గొర్రెలు, మేకలు గోతిలో పడి చనిపోతున్నా మైనింగ్ కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని, అడిగిన ప్రజల పై తిరుగుబాటు చేస్తున్నారని ఈ విషయంపై స్థానిక ప్రజలు మైనింగ్ ఎ డీ , తో స్థానిక ఎమ్మార్వో తో మొర పెట్టుకున్న కనీసం స్పందించడం లేదని, స్థానిక నాయకుల అండదండలతో మైనింగ్ అధికారుల సహకారంతో అక్రమ మైనింగ్ పాల్పడుతున్న వారిపై సమగ్ర విచారణ జరిపించి అక్రమ మైనింగ్ కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, కోరుతూ ప్రజాసంఘాల ప్రతినిధులు, సూపరిండెంట్ శర్మ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది , దీనిపై ఆర్డీవో ఆఫీస్



సూపరిండెంట్ శర్మగారు స్పందిస్తూ వెంటనే ఈ సమస్యను కలెక్టర్ గారికి జిల్లా మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా చిన్ని యాదవ్, సామాజిక నాయకులు నాగేశ్వరరావు చౌదరి, పంచదార్ల పంచాయతీకి చెందిన స్థానిక నాయకులు , తెలుగు యాదవ్ మహా సభ నియోజకవర్గం యూత్ అధ్యక్షులు ,ఊరికిటి నానాజీ యాదవ్, నానే పల్లి సన్యాసిరావు, పకృతి నాగేష్ యాదవ్, దాడి సంతోష, తదితరులు పాల్గొన్నారు.

## కరోనా కిట్లు మాయంపై విచారణ: పెద్దిరెడ్డి రవికిరణ్

**కాకినాడ, వార్తావళి, ఆగస్ట్ 21:** కరోనా కిట్ల కుంభకోణంపై మొక్కుబడి విచారణ తగదని విజిలెన్స్ అధికారు లతో పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శ్రీకాకుళం జిల్లా ఇన్చార్జి పెద్దిరెడ్డి రవి కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా వాసు లను దిగ్భ్రాంతికి గురి చేసిన కరోనా పరీక్షా కిట్ల కుంభకోణంపై ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ గారు ఆదివారం విచారణకు ఆదేశించడం శుభ పరిణా మమని అయితే విచారణ కమిటీ సభ్యుల కూర్పు పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏ సంస్థలో అయితే పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయో, ఏ సంస్థలో అయితేపై స్థాయి నుంచి కింది స్థాయి వరకూ అనేక వ్యక్తుల ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమ య్యాయో, ఆ సంస్థలోని వ్యక్తులనే విచా రణ అధికారులుగా నియమించడం ఎంతవరకు సమంజసమన్నారు.



# క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్

## 662, 48 ఎంపి ట్రిపుల్ కెమెరాతో పాటు అసాధారణమైన బ్యాటరీ అండ్ డిస్‌ప్లేతో

**విశాఖపట్నం, వార్తావళి, ఆగస్ట్ 21:** తన అతిపెద్ద ఫ్రాంఛాయిస్‌గా (జి సిరీస్) తదుపరి తరాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చిన మోటరోలా - ప్రపంచంలోనే మొదటిసారిగా భారతదేశంలోనే మోటో జి9ను విడుదల చేసింది! తక్షణమే ప్రతిస్పందించే క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 662తో, ప్రపంచంలోనే మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్లలో ఒకటైన మోటో 48 ఎంపి ట్రిపుల్ కెమెరా సిస్టమ్, 20 టర్బోపవర్‌ఛార్జింగ్‌తో 5000 ఎమ్ఏహెచ్ బ్యాటరీతో అన్ని అత్యుత్తమ శ్రేణి ఫీచర్లను కలిగి ఉంది. రూ. 11,499/- లకు ఆగస్టు 31 మధ్యాహ్నం 12 గంటల నుంచి ఫ్లిప్‌కార్టులో లభిస్తుంది. భారత మార్కెట్‌పై తన దృష్టిని సారించిన మోటరోలా అపారమైన ప్రజాదరణ పొందిన తన తదుపరి తరం ఫ్రాంఛాయిసీ- మోటోను ప్రపంచంలో మొదటిసారిగా భారతదేశంలో విడుదల చేస్తున్నామని ప్రకటించింది!భారతీయ వినియోగదారుల అవసరాలను తీర్చే ప్రాతిపదికన. వినియోగదారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం పరిశోధించిన చేసిన ఇది త్తి, మేడ్ ఫర్ ఇండియా మాత్రమే కాదు మేడ్ ఇన్ ఇండియాఉత్పత్తి కూడా. పనితీరు, కెమెరా, బ్యాటరీ తదితర అంశాల్లో మోటో శక్తివంతమైనదిగా, దూకుడుగా ఉంటుంది. బోర్డు అంతటా శక్తిని అందించడానికి రూపొందించబడిన, కొత్త మోటో ఉపకరణం ఒక ఉత్పత్తిలోనే వారు కోరుకునే అన్నింటినీ ఒకే చోట అందిస్తూ వినియోగదారుని అనుభవాన్ని తదుపరి స్థాయికి తోడ్కొని వెళుతుంది. నూతన మోటో ఈ శ్రేణిలో చక్కని అనుభవాన్ని అందిస్తూ, సూపర్-ప్రతిస్పందనతో, లేటెస్ట్ క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 662 ప్రాసెసర్ మిమ్మల్ని ఎన్నడూ వెనుకబడేలా చేయదు, ట్రిపుల్ కెమెరా సిస్టమ్-ఇందులోని48 ఎంపి ప్రధాన సెన్సర్‌నూ కలిగి ఉండగా, క్లాస్



లీడింగ్ ఎఫ్ / 1.7అపర్చర్ మరియు రెండు రోజుల పాటు ఫోన్‌ను వినియోగించుకునేందుకు అనువుగా 20 టర్బోపవర్ ఛార్జింగ్‌తో కూడిన5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఇందులో ఉన్నాయి.

**నమ్మశక్యం కాని పనితీరు**

అత్యద్భుతంగా ప్రతిస్పందించే క్వాల్‌కామ్‌స్నాప్‌డ్రాగన్662మొబైల్ ప్లాట్‌ఫారాన్ని కలిగిన మొట్టమొదటి స్మార్ట్‌ఫోన్లలో మోటో ఒకటి. ఆశ్చర్యపరిచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పనితీరు, డైనమిక్ కెమెరా సామర్థ్యాలతో, వినియోగదారులు సరికొత్త విధానాల్లో ఫొటోలను తీసుకుని, బ్రాండ్‌కు మరింత చేరువ అవుతారు. మీరు మృదువైన, స్పష్టమైన గ్రాఫిక్‌లు కలిగిన గేమ్స్ మరియు వీడియోలను చక్కగా ఆస్వాదించనున్నారు. ఇందులోని స్నాప్‌డ్రాగన్ 662ను మరింత వృద్ధి చేసిన వేగం, ఉపకరణంలో పనితీరును మరింత మెరుగు పరిచేలా తయారు చేయడంతో, మీరు తక్కువ లాగ్‌తో మరింత తేలికగా మల్టీ టాస్కింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. దీనితో పాటు, మీ ఫోన్ ప్రతి స్పర్శకు, ట్యాప్‌కు మరియు స్వాప్‌కు తక్షణమే స్పందించేలా చేస్తున్న 4 ఉన్నకి ధన్యవాదాలు చెప్పండి. అద్భుతమైన కెమెరాలు మోటో లోని 48 ఎంపి ట్రిపుల్ కెమెరా సిస్టమ్‌కు ప్రతి ఒక్కరూ ధన్యవాదాలు చెప్పాల్సిందే. ప్రధాన కెమెరాలోని డెప్త్ సెన్సార్, మాక్రో విజన్ కెమెరాతో ఎటువంటి వెలుగులో లేదా సెట్టింగ్‌లో అయినా అద్భుతమైన చిత్రాలను సులభంగా తీయవచ్చు. 48 ఎంపి మెయిన్ కెమెరా సెన్సర్ క్వాడ్ పిక్సెల్ టెక్నాలజీతో4 లైట్ సెన్సిటివిటీ, నైట్ విజన్ మోడ్ మరియు క్లాస్ లీడింగ్, పెద్ద ఎఫ్/1.7 ఎపర్చర్‌తో పూర్తవుతుంది. అందుకే, మీరు తక్కువ కాంతిలోనూ ప్రకాశవంతమైన ఫోటోలను తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. నేపథ్యాన్ని ఆటోమేటిక్‌గా అస్పష్టంగా చేసేందుకు డెప్త్ సెన్సార్ ప్రధాన కెమెరాతో కలిసి పని చేస్తూ, మీ రోజువారీ ఫోటోలను కచ్చితమైన అంచులతో అందమైన పోర్ట్రెయిట్‌లుగా మార్చుతుంది. బంబుల్‌బీ రెక్కల నుంచి మంచు ముద్దపై స్ఫటికాల వరకు, మాక్రో విజన్ కెమెరాతో బంధించేందుకు ప్రపంచం వేచి చూస్తోంది. చిన్న లెన్స్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రామాణిక లెన్స్ కన్నా మీ సబ్జెక్ట్‌ను 4 దగ్గరగా ఉంచేందుకు మీకు అవకాశం కల్పిస్తుంది.

**వేగంగా ఛార్జింగ్ అయ్యే భారీ బ్యాటరీ**

మీరు మీ ఫోన్‌ను వినోదం కోసమైనా, పని లేదా ప్రపంచంతో అనుసంధానం అయ్యేందుకు ఉపయోగించినా, మోటోలోని బ్యాటరీ లైఫ్ గురించి ఆందోళన చెందవలసిన అవసరం ఉండదు. దీనిలోని మాసివ్ 5000 ఎంఎహెచ్ బ్యాటరీని ఒకసారి ఛార్జింగ్ చేసుకుంటే రెండు రోజుల వరకు బ్యాటరీ లైఫ్ నిలిచి ఉండడమే కాకుండా, 83 గంటల పాటు సంగీతాన్ని ఆలకించేందుకు, 16 గంటలు వీడియోలు వీక్షించేందుకు లేదా 13 గంటలు బ్రౌజ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. మీకు తక్షణమే బ్యాటరీ లైఫ్ కావలసిన సమయంలో 20 టర్బోపవర్ ఛార్జర్‌తో ఛార్జింగ్ పెట్టుకున్న కొద్ది నిమిషాల్లోనే మీకు కొన్ని గంటల శక్తిని ఇస్తుంది.

## శాంసంగ్ స్వాతంత్ర్య దినోత్సవ ఆఫర్లతో మీ ఇంటికి సరికొత్త అందాలనివ్వండి

**విశాఖపట్నం, వార్తావళి, ఆగస్ట్ 21:** భారతదేశంలో అత్యంత విశ్వసనీయమైన కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, శాంసంగ్ ఇప్పుడు ప్రత్యేకంగా స్వాతంత్ర్యదినోత్సవ ఆఫర్లను టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, స్మార్ట్ ఓవెన్లు, వాషింగ్ మెషీన్లు మరియు ఎయిర్ కండీషనర్లపై అందిస్తుంది. ఈ ఉత్సాహపూరితమైన ఆఫర్లు, పలు ఆకట్టుకునే డీల్స్, ఆకర్షణీయమైన ఋణ పథకాలతో 15% వరకూ క్యాష్‌బ్యాక్, అతి తక్కువగా 990 రూపాయలతో సులభమైన ఈఎంఐలతో వస్తున్నాయి. ఈ ఆఫర్లు ఆగస్టు 31,2020 వ తేదీ వరకూ లభ్యమవుతాయి. ఈ వినూత్నమైన ఆఫర్లు ఖచ్చితమైన ప్రయోజనాలను శాంసంగ్ కన్స్యూమర్ డ్యూరబల్ ఉత్పత్తులైనటువంటి శాంసంగ్ క్యుఎల్ఈడీ టీవీలు, 4కె యుహెచ్‌డీ టీవీలు, స్మార్ట్ టీవీలు, స్పేస్‌మ్యాక్స్ ఫ్యామిలీ హబ్ రిఫ్రిజిరేటర్, సైడ్ బై సైడ్ మరియు ఫ్రాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్లు, ఫ్లెక్స్‌వాష్ వాషింగ్ మెషీన్లు, యాడ్ వాష్ వాషింగ్ మెషీన్లు, ఫుల్లీ ఆటోమేటిక్ ఫ్రంట్ లోడ్ మరియు టాప్ లోడ్ వాషింగ్ మెషీన్లు, స్మార్ట్ ఓవెన్లు , విండ్ ఫ్రీ ఎయిర్ కండీషనర్లు వంటి కొనుగోలుపై పొందవచ్చు. తమ విస్తృతశ్రేణి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ శాంసంగ్ ఇటీవలనే సౌండ్‌బార్స్‌ను ఎంపిక చేసిన మోడల్స్‌లో వినూత్నమైన క్యు-సింఫనీ ఫీచర్‌తో విడుదల చేసింది. ఇది టీవీతో పాటుగా లీనమయ్యే శబ్ద అనుభవాలను అందిస్తుంది. ఆఫర్ పీరియడ్‌లో, శాంసంగ్ క్యుఎల్ఈడీ 8కె టీవీలను కొనుగోలు చేసిన వినియోగదారులు 77,999 రూపాయల విలువ కలిగిన గెలాక్సీ ఎస్20ం ను పొందగలరు. వినియోగదారులు 10 సంవత్సరాల నో స్క్రీన్ బర్న్ ఇన్ వారెంటీని మరియు మూడు సంవత్సరాల వారెంటీని ప్యానెల్‌పై ఎంపిక చేసిన క్యుఎల్ఈడీ టీవీలపై పొందగలరు. శాంసంగ్ స్మార్ట్ టీవీలను కొనుగోలు చేసే వినియోగదారులు 9000 రూపాయల క్యాష్‌బ్యాక్‌ను మరియు అతి తక్కువగా 990 రూపాయల ఈఎంఐ సౌకర్యాన్ని మరియు 43 అంగుళాలు మరియు ఆ పైన మోడల్స్ కలిగిన టీవీల కొనుగోలుపై ఒక ఈఎంఐ తగ్గింపు పొందవచ్చు. వినోద కోణంలో చూసినప్పుడు శాంసంగ్ టీవీలు ఒక నెల ఉచిత జీ5 సబ్ స్క్రిప్షన్ మరియు జీ5 ప్రీమియం ప్యాక్‌లపై 30% రాయితీ అందుకోవచ్చు. రిఫ్రిజిరేటర్ విభాగంలో , శాంసంగ్ స్పేస్‌మ్యాక్స్ ఫ్యామిలీ హబ్ రిఫ్రిజిరేటర్ కొనుగోలు చేసిన ఎడల 37,999 రూపాయల విలువ కలిగిన గెలాక్సీ నోట్ 10 లైట్‌ను అందుకోగలరు. అదనంగా, శాంసంగ్ రిఫ్రిజిరేటర్లు మరియు వాషింగ్ మెషీన్ల కొనుగోలుపై వినియోగదారులు 15% వరకూ క్యాష్‌బ్యాక్ మరియు అతి సులభమైన ఈఎంఐ అవకాశాలను అతి తక్కువగా 990 రూపాయలకు పొందడం చేయవచ్చు. వీటితో పాటుగా 300 లీటర్ల సామర్థ్యం కలిగిన రిఫ్రిజిరేటర్ల కొనుగోలుపై ఒక ఈఎంఐ తగ్గింపును పొందవచ్చు. రిఫ్రిజిరేటర్ల డిజిటల్ ఇన్వర్టర్ కంప్రెషర్‌పై 10 సంవత్సరాల వారెంటీని అందిస్తుంది. వాషింగ్ మెషీన్ల మోటార్‌పై 12 సంవత్సరాల వారెంటీ మరియు పూర్తి మెషీన్‌పై 30 సంవత్సరాల వారెంటీ అందిస్తుంది. ఈ ఆఫర్లు ఫ్యామిలీ హబ్, సైడ్ బై సైడ్, ఫ్రాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్లు మరియు ఫ్లెక్స్ వాష్ మరియు యాడ్‌వాష్ మెషీన్లు మరియు ఫుల్లీ ఆటోమేటిక్ ఫ్రంట్ లోడ్ మరియు టాప్ లోడ్ వాషింగ్ మెషీన్లపై పొందవచ్చు. శాంసంగ్ ఎయిర్ కండీషనర్లను కొనుగోలు చేసిన వినియోగదారులు అతి తక్కువగా 990 రూపాయలకు ఈఎంఐ పొందవచ్చు. శాంసంగ్ విండ్ ఫ్రీ ఎయిర్ కండీషనర్లు 23వేల మైక్రో హోల్స్‌తో వస్తున్నాయి. ఇవి మృదువుగా గాలిని గది మొత్తం వ్యాప్తి చేసేలా చేయడంతో పాటుగా ఎలాంటి డ్రాఫ్ట్ లేకుండా సౌకర్యవంతంగా చల్లదనం నిర్వహించవచ్చు. ఈ ఎయిర్ కండీషన ర్ల కొనుగోలుపై అదనంగా 15% క్యాష్‌బ్యాక్‌ను పొందవచ్చు. అలాగే కండెన్సర్‌పై 5 సంవత్సరాలు, పీసీబీ కంట్రోలర్ వారెంటీ, డిజిటల్ ఇన్వెర్టర్ కంప్రెషర్‌పై 10 సంవత్సరాల వారెంటీని ఎంపిక చేసిన ఎయిర్ కండీషనర్ మోడల్స్‌పై పొందడంతో పాటుగా ఉచిత ఇన్‌స్టాలేషన్, ఉచిత గ్యాస్ రీచార్జ్‌ను సైతం అందిస్తున్నారు. సంప్రదాయ స్మార్ట్ ఓవెన్స్‌లోని ఎంపిక చేసిన 28లీటర్ పైబడిన మోడల్స్ కొనుగోలుపై వినియోగదారులు ఉచిత బోరొసిల్ కిట్, సెరామిక్ ఎనామిల్ కేవిటీపై 10 సంవత్సరాల వారెంటీ తో పాటుగా మాగ్నెట్రాన్‌పై 5 సంవత్సరాల వారెంటీ పొందవచ్చు. ఈ సందర్భానికి మరింతగా జోడిస్తూ శాంసంగ్ తమ 'మై శాంసంగ్ మై ఈఎంఐ' ఆఫర్‌తో వినియోగదారులకు ఈఎంఐలను మరియు డౌన్‌పేమెంట్‌ను తమ బడ్జెట్‌కు అనుగుణంగా ఎంపిక చేసిన టెలివిజన్లు, రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్ మరియు వాషింగ్ మెషీన్లపై పొందవచ్చు. వినియోగదారులు మరింతగా 36 నెలల వరకూ




ఈఎంఐ అవకాశాలు మరియు ఎంపిక చేసిన టీవీలు, రిఫ్రిజిరేటర్ మోడల్స్‌పై ఒక ఈఎంఐ ఉచితం అవకాశాలను పొందవచ్చు. "తమ ఇళ్లను పునరావిష్కరించడానికి నూతన మరియు స్మార్టర్ సాంకేతికతలకు వినియోగదారులు అప్‌గ్రేడ్ కావడానికి తగిన సమయం పండుగల సీజన్. వినియోగదారుల లక్ష్యిత బ్రాండ్‌గా, మా దృష్టి ఎప్పుడూ కూడా సాటిలేని సాంకేతికతను మా వినియోగదారులకు అందించడంపైనే ఉంటుంది. అత్యుత్తమ ఉత్పత్తులను అందించడానికి శాంసంగ్ కట్టుబడి ఉంది. మా తాజా ఆఫర్లు గ్యారెంటీడ్ ప్రయోజనాలను విస్తృత శ్రేణి ఉత్పత్తులపై విభిన్నమైన ధరల వద్ద అందిస్తాయి. వినియోగదారులు విలువ ప్రతిపాదన కోరుకుంటుండటంతో, ఈ వినూత్నమైన ఆఫర్లు వారి అంచనాలను అందుకోగలవని మరియు అర్థవంతమైన ఆవిష్కరణలతో వారి జీవితాలను సమృద్ధి చేయగలవనే నమ్మకంతో ఉన్నాం" అని రాజు పుల్లన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బిజినెస్, శాంసంగ్ ఇండియా అన్నారు.

# విశాఖపట్నం



## జిల్లాలో రోజుకు 6 వేల కోవిడ్ టెస్టులు నిర్వహించాలి

### జిల్లా కలక్టరు వి.వినయ్ చంద్

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 24:** ప్రతిరోజూ జిల్లాలో పట్టణ పరిధిలో 4 వేలు, గ్రామీణ పరిదిలో 2 వేలు కోవిడ్ టెస్టులు చేయాలని జిల్లా కలక్టరు వి.వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుండి 22 తేదీల మద్య వచ్చిన కేసులలో 80 శాతం కేసులు పట్టణ పరిధిలోను, 21 శాతం కేసులు గ్రామీణ పరిధిలోను నమోదయ్యాయని తెలిపారు. మరణాలలో 66 శాతం పట్టణ పరిధిలో నమోదు కాగా 34 శాతం గ్రామీణంలో సంభవించాయన్నారు. జిల్లాలో టెస్టులు తగినంత వేగంగా జరుగుటలేదని కంటైన్ మెంటు జోన్, ఏక్టివ్ క్లస్టర్స్ లలోను, అనుమానిత లక్షణాలున్నవారినకి, 60 సంవత్సరాల పైబడినివారికి వీలైనంత వేగంగా టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. పి.హెచ్.సి. స్థాయినుండే టెస్టులు సంఖ్య పెంచాలన్నారు. మొబైల్ టెస్టింగు సదుపాయాలను వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో తగినంత సంఖ్యలో టెస్టులు చేయకపోవడం, టెస్టుల రిజల్టు ఆలస్యంగా ఇవ్వక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. టెస్టుల ఫలితాలు ప్రకటించుటకు ఎక్కువ సమయం తీసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ఐ.సి.ఎం.ఆర్. వారు జిల్లాలో నిర్వహిస్తున్న టెస్టులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. పట్టణ పరిధిలో ప్రతి వార్డుకు అర్బన్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేయాలని, ఇద్దరు డాక్టర్లు, సిబ్బందిని నియమించి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. టెస్టులు గ్రామ, వార్డు స్థాయినుండే నిర్వహించాలన్నారు. గ్రామీణంలో ఆశ వర్కర్లు సేవలు ఉపయోగించుకోవాలన్నారు. సచివాలయాలలో ఇంటర్నెట్ సదుపాయలు ఏర్పాటుచేసి, డిజిటల్ అసిస్టెంటు ద్వారా డేటా నమోదు చేయించాలన్నారు. డిజిటల్ అసిస్టెంటు లేకపోతే తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలన్నారు. పాజిటివ్ వచ్చిన వారిని, కాంటాక్ట్ కేసులు, హెూమ్ ఐసోలేషనులో ఉన్నవారిని మ్యాపింగు చేయాలన్నారు. వారివివరాలు యాప్ నందు అప్ లోడ్ చేయాలన్నారు. వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ స్వంత భవనాలు నిర్మాణానికి 400 లేక 450 గజాలు స్థలం పరిశీలించి సిద్ధం చేయాలన్నారు. కోవిడ్ ఆసుపత్రిలకు ఆక్సిజన్ సరఫరా పై సమీక్షిస్తూ ఆక్సిజన్ సరఫరా చేస్తున్న సంస్థ కార్యకలాపాలపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆసుపత్రులలో బల్క్ ఆక్సిజన్ ట్యాంకులు సకాలంలో ఏర్పాటు చేయక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. 48 గంటలలో అన్ని ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరా జరుగకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రులలో కావలసిన మానవ వనరులను సమీకరించుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రభుత్వం నుండి ఆమోదం పొందిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అందుకు అవసరమైన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. పోస్టులు భర్తీ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరగాలని తెలిపారు. సిబ్బంది అటెండెన్స్, పనితీరుపై పర్యవేక్షించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాకు కేటాయించిన వెంటిలేటర్స్ అవసరమైన ఆసుపత్రులకు సర్దుబాటు చేసారు. కోవిడ్ బాధిత గర్భిణీలకు, డయాలసిస్ కే.జి.హెచ్. లో చికిత్స అందించే ఏర్పాటు చేయాలని వైద్యాధికారులు కోరగా పరిశీలించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.వి.ఎం.సి. కమీషనరు జి.సృజన, వి.ఎం.ఆర్.డి.ఎ. అదనపు కమీషనరు మంజీర్, కె.జి.హెచ్. సూపరింటెండెంట్ డా. సుధాకర్, ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. విజయలక్ష్మి, డి.సి.హెచ్.ఎస్. డా. లక్మణరావు, విమ్స్ డైరెక్టరు సత్యప్రసాద్, చీఫ్ హెల్త్ సూపరింటెండెంట్ డా. శాస్త్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ బద్ధమైన భావప్రకటన హక్కును కాపాడుకొందాం

**విశాఖపట్నం, పశ్చిమ, వార్తావళి, ఆగష్టు 24:** ప్రజాస్వామ్యంలో నిరసన,విమర్శ అనేది ఒక సేఫ్టీ వాల్వ్ అని సుప్రీంకోర్టు చెప్పిందని, ప్రజాస్వామ్యానికి మూలమైన భావప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడినప్పుడు దాన్ని రక్షించాల్సిన వారు శిక్షింకు పూనుకోవడం సరైనది కాదని న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు విమర్శించారు.ప్రశాంత్ భూషణ్ దోషిగా ఖరారు చేస్తూ వెలుబడిన తీర్పును నిరసిస్తూ న్యాయవాదులు,పౌర, ప్రజాసంఘాల ప్రతినిధులు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు.పీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఈ శిక్షను ఖరారు చేసే పద్దతిలో కూడా నేరం ఆరోపించ బడ్డ వ్యక్తి యొక్క అవకాశాలు, హక్కులు ఉపయోగించుకోనియలేదు. ప్రజాస్వామ్యాన్ని బలహీన పరచటానికి సుప్రీం కోర్టులు కూడా సహకరించాయని తాను చేసిన ట్వీట్ లను అవకాశమిస్తే ఆధారాలతో సహా నిరూపిస్తాన్నన్నా,విమర్శను నిరూపించే అవకాశం ఇవ్వలేదని దుయ్యబట్టారు.తనపై విచారణ చేపట్టే జడ్జీ తనపట్ల వ్యక్తిగత వ్యతిరేకత కలిగి ఉన్నారని, బహిరంగంగా మోదీని సదరు న్యాయమూర్తి పొగుడుతున్నారని, తాను మోడీని విమర్శించడం వలన తనపట్ల వ్యతిరేకత చూపించే అవకాశంఉందన్నారు.సదరు న్యాయమూర్తిని మర్చి,న్యాయ ప్రక్రియకు ఆటంకం చేయకుండాచెయ్యాలని కోరారు.అప్రకటిత అత్యవసర పరిస్థితి ప్రజాస్వామిక వ్యవస్థలని నాశనం చేస్తుందని, విమర్శ,నిరసన చేసే ప్రజాస్వామిక హక్కు కోసం నిలబడిన ప్రశాంత్ భూషణ్ కి అండగా పోరాడాలని రాజ్యాంగ బద్ధమైన హక్కుల్ని పరిరక్షించేందుకు అందరూ సమాయత్తం కావాలని ప్రజా, పౌర,న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో విశాఖపట్నం మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం నిర్వాహకులు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి, పి ఓ డబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మీ,ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎ విమల నాయవాదులు ఐ. ఎం. అహ్మద్,కె ఎస్ చలం,పి వి ఎ గౌరి, మహిళా చేతన కె.పద్మ, రాజకీయ ఖైదీల విడుదల కోసం కృషి చేస్తున్న సంస్థ నుండి పద్మ,సీపీఐ నగర కార్యదర్శి ఎం.పైడిరాజు,ఇంసాఫ్ నుండి ఎస్ కె రెహమాన్, సీపీఐ ఎం ఎల్ నాయకుడు గణేష్ పాండా,ఎంఎన్ఎస్ ఎస్ నాయకుడు కె.రవి, దళిత విముక్తి నుండి ఎస్. వెంకటరమణ,ఎ ఐ వై ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.బుజ్జి గణపతి,వి.కన్నబాబు,దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి జి రాంబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎన్ అప్పన్న,ముఠా కార్మిక సంగం నాయకుడు ఎం మన్మదరావు, మత్స్య కార్మిక సంఘం నాయకుడువి.నల్లయ్య,భారత నాస్తిక సంఘం నాయకులు రాంప్రభు, ఎన్.బి.న్యాయవిద్యార్థి జి.సూరజ్,సేవ్ ఎడ్యుకేషన్ నాయకుడు కిశోర్, ఆటో కార్మిక సంఘం నాయకుడు జి. వామనమూర్తి అధికసంఖ్యలో న్యాయవాదులు, పలువురు పౌర, ప్రజాసంఘాలనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## మాస్కులు ధరించేలా అవగాహన కల్పించాలి



**విశాఖపట్నం, తూర్పు, వార్తావళి, ఆగస్ట్ 24:** జిల్లాలో కోవిడ్ - 19ను అరికట్టేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్న కలెక్టర్ వి.వినయ్ చంద్‌ను "కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ " తరపున ఛైర్మన్ కోనాడ సుదర్శన్, కార్యదర్శి జి. అర్. ప్రభు కిరణ్, స్టేట్ కో ఆర్డినేటర్ మారియా మరియు జిల్లా ప్రెసిడెంట్ హిల్డా మ్యాత్యులు అభినందనలు తెలిపి, శాలువాతో సత్కరించారు. కరోనా వ్యాప్తి నివారణకు అన్ని వ్యాపార సంస్థలు వినియోగదారులకు తప్పనిసరిగా శ్యానిటైజర్‌ను అందుబాటులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అందరూ మాస్కలను ధరించేలా అవగాహన కల్పించాలని కోరారు.

## సీఎం సహాయనిధి చెక్కులు అందచేసిన కెకె రాజు



**విశాఖపట్నం, ఉత్తరం, వార్తావళి, ఆగస్ట్ 24:** అనారోగ్యం బారినపడి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 53 కుటుంబాలకు,విశాఖ ఉత్తర నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయ కర్త కె కె రాజు ముఖ్యమంత్రి సహాయనిధి ఇప్పించి ఆదు కున్నారు. ఈరోజు విశాఖ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో 19లక్షల 90వేల రూపాయల చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ఈ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటినుండి బడుగు బలహీన వర్గాలు సంక్షేమమే లక్యంగా ఈ రాష్ట్రంలో వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి రాష్ట్రంలో ఏ పేదవాడు కూడా ఆర్థిక స్తోమత లేక వైద్యం చేయించుకోలేక మరణించ కూడదు ఏ ఒక్క పేదవాడు నేను అనారోగ్యంతో ఉన్నాను నా ఆర్థిక స్తోమత బాగోలేక నేను మంచి వైద్యం చేయించుకోలేకపోయాను అనే భావన కలగకూడదు అనే ఉద్దేశంతో వై.యస్. జగన్మోహన్ రెడ్డి వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారని ఈ క్రమంలో రూ1000ఫీజు నుండి 10 లక్షల ఫీజు వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందే విధంగా మార్పులు చేయటం జరిగిందని వందలాది వ్యాధులు ఆరోగ్యశ్రీ ద్వారా వర్తింప జేసే విధంగా సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బానాల శ్రీను, జి.వి.రమణి, బులుసు జగదీష్,వార్డు అభ్యర్థులు సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్,ఆళ్ళ లీలావతి, కటుమూరి సతీష్, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్,రెయ్యి వెంకటరమణ,బర్కత్ అలీ,వార్డు అధ్యక్షులు షేఖ్ జుబేర్,పైడి రమణ,కె.పి.రత్నాకర్, సీనియర్ నాయకులు నీలి రవి,విశ్వనాధ రాజు,షేఖ్ బాబ్జి,బోగవల్లి గోవింద్,కొణతాల రేవతి రావు,ఆదిరెడ్డి అప్పారావు, గంగా మహేష్,నంబాల ఈశ్వరవు, వై.సింద్దార్ధ, కోరిబిల్లి విజయ్, వసంతల అప్పారావు,కె.చిన్నా, బి.గోవింద్,రాఘవులు,పద్మ శేఖర్, గోపి, మీసాల అప్పారావు, సన్నీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## బొత్సకు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధుల పరామర్శ

**సాలూరు, వార్తావళి, ఆగస్ట్ 24:** రాష్ట్ర పట్టణాభివృద్ధి, పురపాలక శాఖామంత్రి బొత్స సత్యనారాయణను పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. బొత్స మాతృమూర్తి ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాధ్ రెడ్డి, రాష్ట్ర గృహనిర్మాణ శాఖామంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు సోమవారం మంత్రి బొత్స ఇంటికి చేరుకొని పరామర్శించారు. బొత్స తల్లి ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అలాగే రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, పార్లమెంటు సభ్యులు బాలసౌరి, శాసనసభ్యులు కొలుసు పార్ధసారధి, కె.నాగేశ్వరరావు, కె.భాగ్యలక్ష్మి కూడా బొత్స సత్యనారాయణను పరామర్శించారు.



## అవార్డుతో సత్కరించిన హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్



**పార్వతీపురం, వార్తావళి, ఆగస్ట్ 24:** ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి అర్. కూర్మనాథ్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఓఎన్‌హెచ్ (అవర్ నైబర్‌హుడ్ హీరో) పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని ఆ బ్యాంకు ఉన్నతాధికారులు సోమవారం ప్రాజెక్టు అధికారికి వారి ఛాంబర్‌లోఅందజేసారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిఎఫ్‌సి డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ సందీప్ పట్నాయక్, బ్రాంచ్ మేనేజర్ ధనుంజయ బాబు, ఏ.జి.అర్.ఐ. అర్. ఎం బి. శంకర్ రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏయూలో బిటెక్ హానర్స్ కోర్సుకు శ్రీకారం

### వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, ఆగస్ట్ 24:** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించే దిశగా సిలబస్ రూపకల్పన చేయడం జరుగుతోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ సమావేశం జరిగింది. సెనేట్ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అద్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితులను అధిగమిస్తూ ముందకు సాగడం జరుగుతోందన్నారు. అన్‌లైన్ బోధన విధానాన్ని అవలంభించామన్నారు. వర్సిటీలోని పలు విభాగాలు వెబినార్‌లను సమర్ధవంతంగా నిర్వహించాయన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో సైతం తమ విశ్వవిద్యాలయం ఆచార్యులు సమర్ధవంతంగా పరిశోధన ప్రాజెక్టలను సాధించడం శుభపరిణామమన్నారు. త్వరలో విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో సేవలు అందించే దిశగా, విద్యార్థులకు తరగతులు, పరీక్షల నిర్వహణకు విభిన్న వ్యూహాలను అవలంభించడం జరుగుతోందని వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి సూచించిన విధంగా ప్రతీ విద్యార్థికి ఉపాదిని అందించే దిశగా ఇంజనీరింగ్ సిలబస్‌లో మార్పులు చేసారు. బిటెక్ హాజన్స్, బిటెక్ మైనర్ కోర్సులను ప్రారంభించడానికి సెనేట్ ఆమోదం తెలియజేసింది. ప్రతీ విద్యార్థికి పూర్తిస్థాయిలో నైపుణ్యాలు, అదనపు సామర్ధ్యాలు కల్పించే దిశగా ఈ 10 నెలలు ఇంటర్న్‌షిప్,5 స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను దీనిలో అందించనున్నారు. ఎంఆర్ సంస్కృత కళాశాల నుంచి ఐదేళ్ల బిఏ ఓరియంటల్ లాంగ్వేజ్ కోర్సును ప్రారంభించడానికి సెనేట్ ఆనుమతి ఇచ్చింది. సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, మాజీ వీసీ ఆచార్య కె.వి రమణలు ప్రత్యక్షంగా పాల్గొనగా మాజీ వీసీలు ఆచార్య జి.ఎస్.ఎన్ రాజు, ఆచార్య బీల సత్యనారాయణలు పరోక్షంగా పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

'వార్తావళి' తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు పశ్చిమగోదావరి, అనంతపురం జిల్లాల్లో జిల్లా ఇన్‌చార్జ్‌లుగా పనిచేయుటకు కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

7032034001, 8500159006

## ప్రసిద్ధమైన క్షేత్రం శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయం



**గొల్లలమామిదాడ, వార్తావళి, ఆగష్టు 24:** ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలోని గోల్లల మమడడ వద్ద ఉన్న శ్రీ సూర్యనారాయణస్వామి దేవాలయం సూర్య భగవానుడికి అంకితం చేయబడింది. ఈ ఆలయాన్ని 1920లో శ్రీ కోవ్వురి బాసివీ రెడ్డి స్థాపించారు. గొల్లల మామిడాడలో గల శ్రీ సూర్యనారాయణస్వామి వారి ఆలయం చాల ప్రసిద్ధమైన క్షేత్రం. దీనిని గోపురాల మామిడాడ అని కూడా పిలుస్తారు. సూర్య నమస్కారాల చిత్రాలు గోడల మీద ఆలయ ద్వారం వద్ద ప్రదర్శించబడతాయి. కృష్ణుడి విగ్రహం ఒక చిన్న విగ్రహం గోపురం పైన ఉన్న అద్దంలో చూడవచ్చు. దేవాలయ వెలుపలి గోడలు దేవతల వివిధ చిత్రాలతో చెక్కినవి. సమస్త జగత్తులో ప్రత్యక్ష దైవంగా నిలిచి అందరినీ కాచేవాడు సూర్యభగవానుడు. ఏడు గుర్రాల రథంలో సవారీ చేస్తూ సమస్త ప్రాణకోటిని రక్షిస్తాడు. తన కిరణాలతో దేవతలను, పితృదేవతలను, మనుషుల్ని తృప్తిపరుస్తూ ఉంటాడు. అలాంటి దేవున్ని ఎంతో మంది భక్తులు ఆధ్యాత్మికతతో కొలుస్తుంటారు. ఇలా ఎంతో మంది భక్తులు కోరికలు తీర్చే దేవుల్లకి ఆలయాలు నిర్మించి కొలుస్తుంటారు. అలా నిర్మించిన ఆలయాలు ఆంధ్రప్రదేశ్లో ఎన్నో నెలకొని ఉన్నాయి. ఎంతో ప్రఖ్యాతి గాంచిన సూర్యదేవాలయాల్లో ఒకటైన ఆలయం గొల్లాల మామిదాడ సూర్యదేవాలయం. ఈ ఆలయం అరసవల్లి సూర్యనారాణయ స్వామి దేవాలయం తరువాత అంతటి ప్రఖ్యాతి గాంచిన రెండో దేవాలయంగా పేరు తెచ్చుకుంది. అక్కడి సూర్యదేవుని ఒక్క సారి దర్శించుకుంటే చాలు భక్తుల కోరికలు కొంగు బంగారమవుతాయని అక్కడికి వచ్చే భక్తులు నమ్మకం. ఏడు గుర్రాల రథంలో సమస్తాన్ని పాలించే దేవున్ని ఒక్క సారి కన్నులారా వీక్షించినంతనే సకల పాపాలూ తొలగిపోతాయి. ఈ ఆలయంలో ప్రతి నిత్యం పూజలు, అర్చణలు నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా సూర్యదేవునికి ఎంతో ప్రీతి పాత్రమైన రోజుగా ఆదివారాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఈ రోజు ఆ దేవాలయంలో ప్రత్యేకమైన అర్చణలను చేస్తుంటారు. దీంతో ప్రతీ ఆదివారం ఆ ఆలయంలో భారీ సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారి కోరికలను కోరుకుంటుంటారు. శ్రీ సూర్యదేవాలయం ప్రాంగణంలో వెంకటేశ్వర ఆలయం, సాయి ఆలయం, ప్రసిద్ధ భీమేశ్వర ఆలయం అనేక ఆలయాలు ఉన్నాయి.

**ఎలా చేరుకోవాలి..** ఈ ఆలయాన్ని చేరుకోవడం చాల సులభం సామర్లకోట నుంచి కేవలం 20 కిమీ దూరం లోనే ఉంది, సామర్లకోట లో రైల్వే స్టేషన్ ఉండటం వల్ల మనం సామర్లకోట చేరుకుంటే రైల్వే స్టేషన్ పక్కన బస్సు స్టాండ్ కలదు. సామర్లకోట నుంచి గొల్లల మామిడాడ చేరుకోవడానికి డైరెక్ట్ బస్సు లు ఉన్నాయి. కాకినాడ నుంచి 25 కిమీ, రాజమండ్రి నుంచి 56 కిమీ దూరం లోను ఈ ఆలయం ఉంది.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006